Janampower.in
TELTEL/2016/69862
# జనం పవర్
తెలుగు దినపత్రిక
JANAM POWER
కరీంనగర్ మంగళవారం 28.04.2026 సంపుటి : 14 సంచిక : 317 పేజీలు: 11 వెల: 5/-
Karimnagar Tuesday 28.04.2026 Valume : 14 Issue : 317 Pages : 11 Cost: 5/-



Editor: BANDARI MARUTHI


## బీఆర్ఎస్ సంస్థాగత ప్రక్షాళన

- అన్ని స్థాయిల కమిటీల రద్దుకు కేసీఆర్ ఆదేశం!
- కేటీఆర్‌కు కీలక బాధ్యతలు..
- త్వరలోనే కొత్త కమిటీల నియామకం



# బీజేపీ ఎంపీ తేజస్వీ సూర్య వ్యాఖ్యలు దుర్మార్గం

ఒక్కరు ఎదిరించి మాట్లాడలేక పోయారు



బీఆర్ఎస్ ఎంపీలుంటే రణరంగం సృష్టించేవారు

రాష్ట్రంలో దైన్యంగా రైతుల పరిస్థితి

ధాన్యం కొనే దిక్కులేకుండా పోయింది

తెలంగాణ భవన్‌లో బీఆర్ఎస్ అధినేత కేసీఆర్

**హైదరాబాద్, ఏప్రిల్ 27:** రాష్ట్రంలో రైతుల పరిస్థితి దిగజారిపోయిందని మాజీ సీఎం, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ అన్నారు. ప్రభుత్వానికి ధాన్యం కొనడం చేత కావట్లేదని విమర్శించారు. పార్టీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా సోమవారం తెలంగాణ భవన్‌లో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో ఏం జరుగుతోందో అర్థం కావడం లేదు. తెలంగాణ గురించి ఎంపీ తేజస్వి సూర్య ఇష్టం వచ్చినట్లు మాట్లాడారు. ఆయన వ్యాఖ్యలపై కాంగ్రెస్, భాజపా ఎంపీలు ఒక్కమాట మాట్లాడలేదు. బీఆర్ఎస్ ఎంపీలు లోక్‌సభలో ఉండి ఉంటే రణరంగం సృష్టించేవాళ్లు. కాళేశ్వరంపై రాజ్యసభలో సీఆర్ పాటిల్ మాట్లాడితే సురేశ్‌రెడ్డి గట్టిగా ఖండించారు. తెలంగాణ గురించి ఇష్టం వచ్చినట్లు మాట్లాడితే కాంగ్రెస్, భాజపా నేతలు ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. రాష్ట్ర విభజన సమయంలో.. హైదరాబాద్ విషయంలో రాజీ పడాలని సోనియా గాంధీ ఎన్నో సార్లు చెప్పారు. కానీ.. నేను ఎప్పుడూ రాజీ పడలేదు..అది నా చిత్తశుద్ధి అని కేసీఆర్ అన్నారు.బీజేపీ ఎంపీ తేజస్వి సూర్యపై బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ మండిపడ్డారు. డీలిమిటేషన్ బిల్లుపై చర్చ సందర్భంగా బ్రిటిషర్లు భారత్, పాకిస్థాన్‌ను వేరుచేసినట్టు అత్యంత చెత్త విధానంతో ఆంధ్రప్రదేశ్ నుంచి తెలంగాణను వేరుచేశారంటూ తేజస్వి చేసిన వ్యాఖ్యలపై ఆగ్రహం వ్యక్తం చేశారు. సభలోనే ఉన్న కేంద్రమంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్ సహా 16మంది రాష్ట్ర ఎంపీలు ఎవరూ దానిపై కనీసం అభ్యంతరం తెలుపకుండా మౌనంగా ఉన్నారని.. అదే పార్లమెంట్‌లో మన ఎంపీలు ఉండుంటే తేజస్వి సూర్య మాట్లాడిన మాటలకు రణరంగం చేసేవాళ్లు అని పార్టీ అంతర్గత సమావేశంలో అభిప్రాయపడ్డారు.

మిగతా 2 లో





# మహిళల భద్రతకు పెద్దపీట

## చిన్నారుల రక్షణకు ప్రాధాన్యం

## డ్రగ్స్‌పై ఉక్కుపాదం

మహిళలను అన్ని రంగాల్లో ఆదర్శంగా నిలిపాం

మహిళాభివృద్ధికి తెలంగాణ బ్రాండ్ కావాలి

గంజాయి, డ్రగ్స్‌పై ఉక్కుపాదం మోపుతున్నాం

మహాలక్ష్మి పథకంతో మహిళలకు ఉచిత బస్సు

అన్నిరంగాల్లో మహిళా రిజర్వేషన్ల కాంగ్రెస్ ఘనతే

స్పందన బృందాల ప్రారంభోత్సవంలో సీఎం రేవంత్

**హైదరాబాద్, ఏప్రిల్ 27 :** అభివృద్ధి చెందిన దేశాల్లో మహిళలు, చిన్నారుల రక్షణకు మొదటి ప్రాధాన్యత ఉంటుందని, ఏ నగరంలో వీరికి భద్రత ఉంటుందో అక్కడ అభివృద్ధి వేగంగా జరుగుతుందని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. సోమవారం హైదరాబాద్‌లో మహిళా భద్రతా విభాగం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన 'స్పందన' బృందాలను ఆయన ప్రారంభించి ప్రసంగించారు. మహిళలకు తక్షణ రక్షణ, మానసిక భద్రత కల్పించడమే లక్ష్యంగా ఈ బృందాలు పనిచేస్తాయని ఆయన వెల్లడించారు. తెలంగాణ ప్రభుత్వం మహిళల భద్రతకు పెద్దపీట వేస్తోందని, గతంలో షీ టీమ్స్ ఉంటే ఇప్పుడు 'స్టాండ్ విత్ హర్' వంటి వినూత్న కార్యక్రమాల ద్వారా వారికి అండగా నిలుస్తున్నామని సీఎం స్పష్టం చేశారు. కేవలం చట్టాలు చేయడం మాత్రమే కాకుండా, సమస్య అసలు తలెత్తకుండా చూడాల్సిన సామాజిక బాధ్యత అందరిపైనా ఉందని ఆయన ఉద్ఘాటించారు.

మిగతా 2 లో



## బీఆర్ఎస్‌కు గతమే.. భవిష్యత్ లేదు

కవిత పార్టీ కుటుంబ గూడుపురాణి

కేసీఆర్ చావాలని ఎప్పుడూ కోరుకోలేదు

కాళేశ్వరంపై సీబీఐ విచారణ తరవాతే చర్యలు

మీడియాతో చిట్‌చాట్‌లో సీఎం రేవంత్ రెడ్డి



## ఎమ్మెల్సీల ప్రమాణం

2

సీఎం రేవంత్ రెడ్డి సమక్షంలో కోదండరామ్, అజారుద్దీన్‌తో ప్రమాణం చేయించిన మండలి చైర్మన్ గుత్తా

## బెంగాల్ ప్రజలకు ప్రధాని మోడీ బహిరంగ లేఖ

3

బీజేపీ ప్రభుత్వ ఏర్పాటుకు ప్రజలంతా కలసి రావాలని పిలుపు

## మహాలింగాపురంలో కూలిన భారీ క్రేన్

ఐదుగురు కార్మికుల దుర్మరణం

ఎన్‌సీసీ సిమెంట్ బ్రిక్స్ కంపెనీలో విషాదం..

మరో 12 మందికి తీవ్ర గాయాలు

ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఒకరి మృతి..

3



## బిర్యానీ, పుచ్చకాయ తిని..



ఫుడ్ పాయిజనింగ్‌తో కుటుంబలో నలుగురు మృత్యువాత

ముంబైలో విషాద ఘటన

.. వివరాలు 4లో

మహారాష్ట్రలోని ఓ కుటుంబంలో తీవ్ర విషాదం చోటుచేసుకుంది. బంధువులతో కలిసి బిర్యానీ, పుచ్చకాయ తిని కొన్ని గంటల్లోనే తీవ్ర అస్వస్థతకు గురై.. 12 గంటల్లో ఒకే కుటుంబానికి చెందిన నలుగురు మృత్యువాత పడ్డారు.

## త్వరలో సర్ ప్రక్రియ



2002 జాబితాతో వివరాల సరిపోలిక..

అర్హులైన ప్రతి పౌరుడికి ఓటు హక్కే లక్ష్యం

రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి

త్వరలో ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియను నిర్వహించనున్నట్లు రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి వెల్లడించారు. ఓటర్ల జాబితా సమగ్రతను కాపాడేందుకు, అక్రమాలను తొలగించేందుకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఆయన ఒక ప్రకటనలో తెలిపారు.


ఏడుగురు ఆప్ ఎంపీల విలీనానికి

## రాజముద్ర

వీరంతా బీజేపీలో చేరినట్లుగా గుర్తించిన చైర్మన్

రాజ్యసభలో 113కు చేరిన బీజేపీ సంఖ్యాబలం

4





## సీనియర్ పాత్రికేయుడు మధుసూదన్ మృతి

సీఎం రేవంత్, భట్టి తీవ్ర సంతాపం

.. వివరాలు 2లో



# ఎమ్మెల్సీలుగా కోదండరామ్, అజారుద్దీన్ ప్రమాణం

### ప్రమాణం చేయించిన మండలి చైర్మన్ గుత్తా

### హాజరైన సీఎం రేవంత్ తదిరులు

**హైదరాబాద్, ఏప్రిల్ 27:** ఎమ్మెల్సీలుగా ప్రొఫెసర్ కోదండరాం, అజారుద్దీన్ ప్రమాణ-స్వీకారం చేశారు. మండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి వారితో ప్రమాణం చేయించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితోపాటు పలువురు మంత్రులు హాజరయ్యారు. గవర్నర్ కోటాలో కోదండరాం, మహమ్మద్ అజారుద్దీన్‌లను ఎమ్మెల్సీలుగా నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిన సంగతి తెలిసిందే. గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా ఆదేశాల మేరకు సాధారణ పరిపాలన శాఖ ఈ మేరకు గెజిట్ నోటిఫికేషన్ జారీ చేసింది. ప్రమాణస్వీకారం అనంతరం ఎమ్మెల్సీ కోదండరాం మాట్లాడుతూ.. తనకు మంత్రి పదవిపై ఆశ లేదని వ్యాఖ్యానించారు. పదవులు అనేవి శాశ్వతం కాదని స్పష్టం చేశారు. ఒకాయన తాను పోరాడాతానా లేదా అని అన్నారని.. తాను పోరాడి చూపిస్తానని చెప్పుకొచ్చారు. గతంలో తనపై అనేక కేసులు పెట్టి ఇబ్బందులకు గురిచేశారని ఆవేదన వ్యక్తం చేశారు. అయిన తన పని ఆగలేదని.. కొనసాగుతోందని స్పష్టం చేశారు. వివాదాస్పద సమస్యకు పరిష్కారం లభించిందని అన్నారు. లక్ష్యాలను ఎంచుకొని పనిచేస్తానని స్పష్టం చేశారు. ఫీజు రీయింబర్స్‌మెంట్, ఉద్యమకారుల సమస్యలు, ఆదివాసుల సమస్యల పరిష్కారం కోసం పనిచేస్తానని అన్నారు. ఇప్పటివరకు చేస్తున్న పనిని సమర్థవంతంగా పూర్తి చేయడానికి తనకు ఎమ్మెల్సీ ఉపయోగపడుతుందని వెల్లడించారు. జయశంకర్‌కు ఇచ్చిన మాట ప్రకారం ముందుకు పోతానని తెలిపారు. గతంలో ఏ రకంగా తన జీవన శైలి ఉందో.. భవిష్యత్తులో కూడా అదేవిధంగా ఉంటుందని స్పష్టం చేశారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం తాను నిలబడతానని.. వారికి ఎప్పుడు అందుబాటులో ఉంటానని కోదండరాం పేర్కొన్నారు మంత్రి అజారుద్దీన్ మీడియాతో మాట్లాడుతూ.. ఎమ్మెల్సీగా తనను ప్రతిపాదించిన కాంగ్రెస్ అధిష్ఠానానికి, మంత్రి మండలికి, పీసీసీకి ధన్యవాదాలు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం మైనార్టీల సంక్షేమానికి ఎంతో ప్రాధాన్యం ఇస్తోందని చెప్పారు. మైనార్టీల సంక్షేమం కోసం మరింత కృషి చేస్తానన్నారు. రాజకీయాల్లో, జీవితంలో ఎత్తుపల్లాలు వస్తుంటాయి. అన్నింటినీ అధిగమిస్తూ ముందుకు సాగాలి. జూబ్లీహిల్స్‌లో ముస్లింల ఓట్ల కోసమే మంత్రి పదవి ఇచ్చారనేది వాస్తవం కాదు. సీఎం రేవంత్‌రెడ్డి మొదట్నుంచీ మైనార్టీలకు పెద్దపీట వేస్తున్నారని అన్నారు.

# శంషాబాద్ ఎయిర్‌పోర్టుకు బాంబు బెదింపు

### రంగంలోకి దిగిన సైబర్ క్రైమ్ పోలీసులు

**హైదరాబాద్, ఏప్రిల్ 27:** హైదరాబాద్‌లోని రాజీవ్ గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయం రెండో టెర్మినల్‌కు సోమవారం బాంబు బెదిరింపు వచ్చింది. సమాచారం అందిన వెంటనే భద్రతా సిబ్బంది అప్రమత్తమయ్యారు. వెంటనే రంగంలోకి దిగిన సెంట్రల్ ఇండస్ట్రియల్ సెక్యూరిటీ ఫోర్స్ అధికారులు టెర్మినల్ అంతటా విస్తృతంగా తనిఖీలు నిర్వహించారు. బాంబ్ స్క్వాడ్, డాగ్ స్క్వాడ్ సహాయంతో ప్రతి ప్రాంతాన్ని పరిశీలించారు. ఈ తనిఖీల తర్వాత ఎలాంటి పేలుడు పదార్థాలు, అనుమానాస్పద వస్తువులు లభించలేదని అధికారులు స్పష్టం చేశారు. దీంతో ఇది ఫేక్ ఈ -మెయిల్ అని నిర్ధారించారు. బెదిరింపు మెయిల్ ఎక్కడి నుంచి వచ్చిందనే విషయంపై సైబర్ క్రైమ్ పోలీసులు విచారణ చేపట్టారు. మెయిల్ సోర్స్, ఐపీ అడ్రస్ తదితర వివరాలను ట్రాక్ చేసే పనిలో ఉన్నారు. తనిఖీల సమయంలో కాసేపు విమానాశ్రయంలో భద్రతా జాగ్రత్తలు చేపట్టినప్పటికీ, సాధారణ విమాన సేవలకు పెద్ద అంతరాయం కలగలేదని అధికారులు తెలిపారు. ఇది ఫేక్ ఈ -మెయిల్ అని తేలడంతో విమానాశ్రయ అధికారులు ఊపిరి పీల్చుకున్నారు.

# సీనియర్ పాత్రికేయుడు మధుసూధన్ మృతి

### సీఎం రేవంత్, భట్టి తీవ్ర సంతాపం

**హైదరాబాద్, ఏప్రిల్ 27:** ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క చీఫ్ పబ్లిక్ రిలేషన్ ఆఫీసర్ మారబోయిన మధుసూదన్ గుండెపోటుతో మృతి చెందారు. అపోలో స్పెక్ట్రా ఆస్పత్రిలో చికిత్స పొందుతూ కన్నుమూశారు. ఈనాడు, ఆంధ్రజ్యోతి వంటి సంస్థల్లో ఆయన సీనియర్ జర్నలిస్టుగా కీలక బాధ్యతలను నిర్వర్తించారు. ఆయనకు భార్య, కుమారుడు ఉన్నారు. మధుసూదన్ మృతి పట్ల ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. నిజాయతీ గల పాత్రికేయుడిని కోల్పోవడం బాధాకరంగా ఉందన్నారు. మధు-సూదన్ ఆకస్మిక మృతి పట్ల ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సంతాపం తెలిపారు. ఆయన హఠాన్మరణం తీవ్రంగా కలచివేసిందన్నారు. సమాచార కమిషనర్ ముకుంద రెడ్డి కూడా సంతాపం ప్రకటించారు.

# మెదక్ జిల్లాలో ట్రావెల్ బస్సు దగ్గం

**మెదక్, ఏప్రిల్ 27:** మెదక్ జిల్లాలోని మాసాయిపేట వద్ద ఎన్‌హెచ్ -44పై ఓ ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు దగ్ధమైంది. ఈ బస్సులో ఒక్కసారిగా మంటలు చెలరేగడంతో ఈ ఘటన జరిగింది. అదృష్టవశాత్తూ డ్రైవర్, క్లీనర్ అప్రమత్తంగా వ్యవహరించడంతో ప్రాణనష్టం తప్పింది. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఓ ప్రైవేట్ ట్రావెల్స్ బస్సులో సాంకేతిక సమస్య తలెత్తడంతో, దానిని రిపేర్ చేయించడం కోసం హైదరాబాద్ నుంచి మెదక్ తీసుకువచ్చారు. రిపేర్ పనులు పూర్తయిన తర్వాత సోమవారం తెల్లవారుజామున డ్రైవర్, క్లీనర్ బస్సును తీసుకుని తిరిగి హైదరాబాద్‌కు బయలుదేరారు. మాసాయిపేట పరిసర ప్రాంతాల్లో ప్రయాణిస్తుండగా, బస్సు ఇంజిన్ భాగం నుంచి ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. గమనించిన డ్రైవర్ వెంటనే బస్సును రోడ్డు పక్కన నిలిపివేశారు. మంటలు నిమిషాల వ్యవధిలోనే బస్సు మొత్తానికి వ్యాపించాయి. మంటలు వేగంగా వ్యాపించడంతో డ్రైవర్, క్లీనర్ ఏమాత్రం ఆలస్యం చేయకుండా బస్సులో నుంచి కిందకు దూకేశారు. దీంతో వారు క్షేమంగా బయటపడ్డారు. సమాచారం అందుకున్న వెంటనే అగ్నిమాపక సిబ్బంది ఫైర్ ఇంజిన్‌తో ఘటనా స్థలానికి చేరుకున్నారు. సుమారు గంటసేపు శ్రమించి మంటలను అదుపులోకి తీసుకువచ్చారు. అయితే, అప్పటికే బస్సు పూర్తిగా కాలిపోయింది. ఈ ప్రమాదం కారణంగా జాతీయ రహదారిపై కొంతసేపు ట్రాఫిక్ నిలిచిపోయింది. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు. షార్ట్ సర్క్యూట్ కారణంగా మంటలు చెలరేగాయా? లేదా రిపేర్ పనుల్లో ఏవైనా లోపాలు ఉన్నాయా? అనే కోణంలో పోలీసులు విచారిస్తున్నారు.

# మహిళల భద్రతకు ప్రభుత్వం పెద్దపీట

మొదటి పేజీ తరువాయి

మహిళా సాధికారత కేవలం మాటలకే పరిమితం కాకుండా క్షేత్రస్థాయిలో అమలు చేయడమే తమ ప్రభుత్వ విధానమని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. రాష్ట్రంలోని 67 లక్షల మంది స్వయం సహాయక సంఘాల మహిళలకు రూ. 60 వేల కోట్ల బ్యాంక్ రుణాలను అందజేశామని, ఇందిరమ్మ ఇళ్లను కూడా మహిళల పేరుతోనే ఇస్తున్నామని తెలిపారు. మహిళలకు ఆర్థిక స్వావలంబన వచ్చినప్పుడే కుటుంబం, సమాజం నిలబడుతుందని ఆయన అభిప్రాయపడ్డారు. మహాలక్ష్మి పథకం ద్వారా చేపట్టిన ఉచిత బస్సు ప్రయాణం వల్ల రాష్ట్రంలోని ఆడబిడ్డలు ఇప్పటివరకు రూ. 10 వేల కోట్లు ఆదా చేసుకున్నారని వెల్లడించారు. మహిళా సంఘాలను పారిశ్రామిక వేత్తలుగా మార్చే క్రమంలో వారికి సోలార్ ఎనర్జీ ప్లాంట్లు, పెట్రోల్ బంకులు, ఇందిరమ్మ క్యాంటీన్లు మరియు ప్రభుత్వ పాఠశాలల యూనిఫాంలు కుట్టే బాధ్యతలను అప్పగించినట్లు వివరించారు. అమెజాన్ వంటి అంతర్జాతీయ సంస్థలతో ఒప్పందాలు చేసుకుని మహిళలు తయారు చేసే ఉత్పత్తులకు ప్రపంచ మార్కెట్ కల్పిస్తున్నామని చెప్పారు.




### డ్రగ్స్ విషయంలో దయాదాక్షిణ్యాలు లేవు

రాష్ట్ర భవిష్యత్తును పాడు చేస్తున్న గంజాయి, డ్రగ్స్ సంస్కృతిపై సీఎం తీవ్ర హెచ్చరికలు జారీ చేశారు. వ్యసనాల బారిన పడిన వారే మహిళలు, చిన్నారులపై అకృత్యాలకు పాల్పడుతున్నారని, అందుకే 'ఈగల్ ఫోర్స్' ద్వారా డ్రగ్స్ మహమ్మారిపై ఉక్కుపాదం మోపుతున్నామని తెలిపారు. ఈ విషయంలో ఎంతటి వారున్నా, సెలబ్రిటీలైనా, ప్రజాప్రతినిధులైనా వదిలిపెట్టే ప్రసక్తే లేదని, ఇప్పటికే కొందరిని అరెస్టు కూడా చేశామని గుర్తు చేశారు. పంజాబ్ రాష్ట్రం డ్రగ్స్ వల్ల ఏ విధంగా నిర్వీర్యమైందో మన కళ్లముందే ఉందని, తెలంగాణకు ఆ పరిస్థితి రానివ్వబోమని ధీమా వ్యక్తం చేశారు. పాఠశాలల్లో చేరే సమయంలోనే విద్యార్థుల నుంచి డ్రగ్స్ తీసుకోబోమని సెల్ఫ్ డిక్లరేషన్ తీసుకునేలా చర్యలు చేపడుతున్నామని, పీస్ కమిటీలు కూడా ఇకపై డ్రగ్స్ నియంత్రణపై దృష్టి సారించాలని సూచించారు.

### భవిష్యత్ లక్ష్యాలపై దిశానిర్దేశం

2034 నాటికి తెలంగాణను వన్ ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుందని, ఇది సాధ్యం కావాలంటే మహిళలు తమ కాళ్లపై తాము నిలబడాలని సీఎం పిలుపునిచ్చారు. రాజ్యాంగబద్ధంగా మహిళలకు రిజర్వేషన్లు కల్పించడంలో కాంగ్రెస్ పార్టీ ఎప్పుడూ ముందుంటుందని, స్థానిక సంస్థల నుంచి పార్లమెంటు వరకు మహిళా ప్రాతినిధ్యం పెరగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మంత్రి సీతక్క, ఎంపీలు అనిల్ కుమార్ యాదవ్, వేం నరేందర్ రెడ్డి, డీజీపీ శివప్రసాద్ రెడ్డి, నగర పోలీస్ కమిషనర్ సజ్జన్నార్, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# బీఆర్ఎస్‌కు గతమే.. భవిష్యత్ లేదు

### కవిత పార్టీ కుటుంబ గూడుపుఠాణి

### కేసీఆర్ ఆరోగ్యంగా ఉండాలనే కోరుకుంటా

### ఆయన చావాలని తానెప్పడూ కోరుకోలేదు

### కాళేశ్వరంపై సీబీఐ విచారణ తరవాతే చర్యలు

### మీడియాతో చిట్‌చాట్‌లో సీఎం రేవంత్ రెడ్డి

**హైదరాబాద్, ఏప్రిల్ 27:** బీఆర్ఎస్ పార్టీకి కేవలం గతం మాత్రమే ఉందని, ఆ పార్టీకి భవిష్యత్తు లేదని సీఎం రేవంత్ రెడ్డి వ్యాఖ్యానించారు. సోమవారం అసెంబ్లీ ప్రాంగణంలో మీడియాతో చిట్‌చాట్‌గా మాట్లాడిన ఆయన, కేసీఆర్ కుటుంబంపై, ఆ పార్టీ మనుగడపై కీలక వ్యాఖ్యలు చేశారు. కేసీఆర్ కుటుంబమంతా ఒక్కటేనని, బయటకు మాత్రం తెచ్చిపెట్టుకున్న నటనను ప్రదర్శిస్తున్నారని ఎద్దేవా చేశారు. అధికారంలో ఉన్న పదేళ్లు ప్రజలతో సంబంధం లేకుండా పాలన సాగించారని, అందుకే ప్రజలు వారిని పక్కన పెట్టారని అన్నారు. కవిత కొత్త పార్టీ ఏర్పాటు వార్తలపై స్పందిస్తూ, ఇదంతా రాజకీయ డ్రామాలో భాగమేనని కొట్టిపారేశారు. కేసీఆర్ ప్రస్తుతం విశ్రాంతి తీసుకుంటున్న ప్రజాప్రతినిధి అని, ఆయన ఆరోగ్యంగా ఉండటం రాజకీయంగా తమకే మంచిదని రేవంత్ రెడ్డి పేర్కొన్నారు.

### వ్యక్తిగత వైరం లేదు.. రాజకీయ పోరాటమే

మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ఆరోగ్యంపై తాను ఎప్పుడూ ప్రతికూలంగా ఆలోచించలేదని రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. కేసీఆర్ తనకు కేవలం రాజకీయ ప్రత్యర్థి మాత్రమేనని, వ్యక్తిగత శత్రువు కాదని అన్నారు. ఆయన ఆరోగ్యంగా ఉంటేనే రాజకీయంగా ఎదుర్కోవడం సులభమవుతుందని వ్యాఖ్యానించారు. గతంలో కేసీఆర్‌కు గాయమైనప్పుడు ఆసుపత్రికి వెళ్లి పరామర్శించానని, అసెంబ్లీలో కలిసినప్పుడు కూడా యోగక్షేమాలు అడిగానని గుర్తుచేశారు. అయితే, కేసీఆర్ కుటుంబ సభ్యులే ఆయనకు చెడు జరగాలని కోరుకుంటున్నారని, ఆయన బతికి ఉంటే తమకు అధికారం రాదని వారు భావిస్తున్నట్లు ఆరోపించారు. కేసీఆర్ సీఎంగా ఉన్నప్పుడే కేటీఆర్‌ను ఆ కుర్చీలో కూర్చోబెట్టాలని మంత్రులతో ప్రకటనలు చేయించిన తీరును ఈ సందర్భంగా ఆయన ప్రస్తావించారు. కాళేశ్వరం ప్రాజెక్టు విషయంలో హైకోర్టు తీర్పును ప్రభుత్వం తప్పుబట్టలేదని, కేవలం సాంకేతిక లోపాలున్నాయని మాత్రమే చెప్పిందని సీఎం వివరించారు. నివేదిక ఆధారంగా తొందరపడి చర్యలు తీసుకోవద్దని కోర్టు సూచించిందని, సీబీఐ విచారణ పూర్తికాగానే అక్రమాలకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు ఉంటాయని స్పష్టం చేశారు. తమ ప్రభుత్వం వివక్ష లేని పాలనను సాగిస్తోందని, ప్రతిపక్షమే లేని విధంగా ప్రజల మద్దతుతో ముందుకు వెళ్తున్నామని ధీమా వ్యక్తం చేశారు. కేసీఆర్‌ను ఇప్పటికే రెండుసార్లు ఓడించానని, ఆయనకు ఓటమి కొత్త కాదని, అలాగే కాంగ్రెస్‌కు గెలుపు కొత్త కాదని వ్యాఖ్యానించారు. గతంలో మహేష్ గౌడ్ చేతిలో కేసీఆర్ ఓడిపోయిన విషయాన్ని కూడా ఈ సందర్భంగా రేవంత్ రెడ్డి గుర్తుచేశారు.

# పార్లమెంట్ తరహా అసెంబ్లీ ప్రాంగణం

### వచ్చే సెషన్ నాటికే సెంట్రల్ హాల్ సిద్ధం!

### పబ్లిక్ గార్డెన్‌లో సభ్యులకు క్లబ్, వాకింగ్ ట్రాక్..

### స్పీకర్, మండలి చైర్మన్‌తో సీఎం సమీక్ష



**హైదరాబాద్, ఏప్రిల్ 27:** అసెంబ్లీ ప్రాంగణం పార్లమెంట్ తరహాలో పనితీరు ఉండేలా అవసరమైన మార్పులు చేపట్టాల్సి ఉందని సిఎం రేవంత్ రెడ్డి అభిప్రాయపడ్డారు. అసెంబ్లీలో చేపట్టాల్సిన పనులపైన శాసనమండలి కాన్ఫరెన్స్ హాల్ లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, అసెంబ్లీ స్పీకర్ ప్రసాద్ కుమార్ లతో సమిక్షా సమావేశం నిర్వహించారు. అధికారులకు పలు సూచనలు చేసారు. ఈసందర్భంగా పార్లమెంట్ తరహా లో అసెంబ్లీ ప్రాంగణం ఉండాలని అభిప్రాయపడ్డారు. సభ గౌరవం పెరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు. మెంబర్స్ కి మరింత ప్రైవసీ ఉండాలన్నారు. పబ్లిక్ గార్డె లో మెంబర్స్ కోసం క్లబ్ ఏర్పాటు చేయాలన్నారు. మెంబర్స్ కోసం వాకింగ్ ట్రాక్,క్రీడల కోసం ఏర్పాట్లు ఉండాలన్నారు. వచ్చే సెషన్ నాటికి సెంట్రల్ హాల్ సిద్ధం కావాలని అన్నారు. పార్లమెంట్ సెంట్రల్ హాల్ తరహాలో ఉండాలని సిఎం రేవంత్ గతంలోనే సూచనలు చేశారు. హెరిటేజ్ భవనాలకు నష్టం జరగకుండా చర్యలు ఉండాలని కూడా సూచించారు. అసెంబ్లీ ప్రాంగణం భద్రతని పటిష్టం చేయాలన్నారు.

# త్వరలోనే సర్ ప్రక్రియ

### రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సి. సుదర్శన్ రెడ్డి

**హైదరాబాద్, ఏప్రిల్ 27:** త్వరలో రాష్ట్రవ్యాప్తంగా జరగనున్న ప్రత్యేక సమగ్ర సవరణ సర్ పక్రియను భారత ఎన్నికల సంఘం నిర్వహించనున్నదని తెలంగాణ రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సి. సుదర్శన్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. దీనికి సంబంధించిన షెడ్యూల్‌ను భారత ఎన్నికల సంఘం త్వరలో విడుదల చేయనుంది. చట్టం ప్రకారం ఓటర్ల జాబితాను సవరించడానికి భారత ఎన్నికల సంఘానికి అధికారాలు ఉన్నాయి. ఓటర్ల జాబితా సమగ్రతను కాపాడేందుకు ప్రతి ఎన్నికకు ముందు లేదా అవసరాన్ని బట్టి సవరణ చేయాలని కమిషన్ ఆదేశిస్తుంది. ప్రస్తుతం ఉన్న ఓటర్ల జాబితాలో తరచూ జరిగే వలసల వల్ల ఓటర్లు ఒకటి కంటే ఎక్కువ చోట్ల పేరు నమోదు చేసుకోవడం, మరణించిన ఓటర్ల పేర్లు తొలగించకపోవడం వల్ల పలు సమస్యలు ఏర్పడ్డాయన్నారు. అర్హత కలిగిన ప్రతి పౌరుడి పేరు ఓటరు జాబితాలో ఉండేలా ఈ ప్రత్యేక సమగ్ర సవరణ పక్రియను భారత ఎన్నికల సంఘం చేపట్టిందన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో ఉన్న ఓటర్ల జాబితాలో నమోదైన ఓటర్ల వివరాలను 2002లో జరిగిన చివరి సవరణద్వారా ఉన్న వారి పేర్లు లేదా వారి బంధువుల పేర్లతో సరిపోల్చే పక్రియను నిర్వహిస్తున్నారు. ఈ వివరాలను ఓటర్లు ఎన్యుమరేషన్ ఫారంలో నమోదు చేయాలి. ఓటర్లు తెలంగాణ ప్రధాన ఎన్నికల అధికారి అధికారిక వెబ్‌సైట్ ఎంపిక ద్వారా తెలుసుకోవచ్చు. పోలింగ్ స్టేషన్ వారీగా ఓటర్ల జాబితా రూపంలో కూడా అందుబాటులో ఉంది. తమ పోలింగ్ స్టేషన్ తెలిసిన వారు కూడా తమ పేర్లను తనిఖీ చేసుకోవచ్చు. ఇక ఓటరు పేరు 2002 ఎన్నికల జాబితాలో కనపడకపోతే, అతను/ఆమె ఆ సమయంలో నమోదు కాలేదని అర్థం. అటువంటి సందర్భంలో, వారి తల్లిదండ్రులు లేదా తాతముత్తాతల వివరాలను వెతికి, వాటిని ఎన్యుమరేషన్ ఫారంలో నమోదు చేసుకోవాలని సూచించారు. 2002 ఓటర్ల జాబితా ముద్రిత ప్రతులు బూత్ లెవెల్ ఆఫీసర్ వద్ద అందుబాటులో ఉంటాయని, వారు మీకు సహాయం చేస్తారని తెలిపారు. ఎన్యుమరేషన్ దశలో ఓటర్లు ఎలాంటి పత్రాలు సమర్పించాల్సిన అవసరం లేదు. అయితే, 2002 జాబితాతో సరిపోల్చలేని ఓటర్లకు నోటీసులు జారీ చేయబడతాయన్నారు. వారి అర్హతను నిరూపించడానికి పత్రాలు సమర్పించాల్సి ఉంటుంది.




# బిర్యానీ, పుచ్చకాయ తిని..

### ఫుడ్ పాయిజనింగ్‌తో కుటుంబలో

### నలుగురు మృత్యువాత

### ముంబైలో విషాద ఘటన

**ముంబై, ఏప్రిల్27:** మహారాష్ట్రలోని ఓ కుటుంబంలో తీవ్ర విషాదం చోటుచేసుకుంది. బంధువులతో కలిసి బిర్యానీ, పుచ్చకాయ తిని కొన్ని గంటల్లోనే తీవ్ర అస్వస్థతకు గురై.. 12 గంటల్లో ఒకే కుటుంబానికి చెందిన నలుగురు మృత్యువాత పడ్డారు. వీరిలో 13 ఏళ్ల బాలిక కూడా ఉంది. ఫుడ్ పాయిజనింగ్ జరగడంతో వీరు మరణించినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. పోలీసుల వివరాల ప్రకారం.. ముంబయి లోని పైధోనీలో అబ్దుల్లా అబ్దుల్ కాదర్ (40) మొబైల్ దుకాణం నిర్వహిస్తున్నారు. అతడి భార్య నస్రీన్ (35). ఈ దంపతులకు ఇద్దరు కుమార్తెలు. శనివారం రాత్రి బంధువులు నిర్వహించిన విందులో అబ్దుల్లా కుటుంబం పాల్గొనింది. అక్కడ బిర్యానీ తిన్నారు. అనంతరం ఇంటికి చేరుకున్నాక అర్ధరాత్రి ఒంటి గంట సమయంలో పుచ్చకాయ తిన్నారు. ఆదివారం ఉదయం 5 గంటల సమయంలో ఆ కుటుంబంలోని అందరికీ వాంతులు, విరేచనాలు మొదలయ్యాయి. వెంటనే అబ్దుల్లా స్థానికంగా ఉన్న డాక్టర్‌ని పిలిచారు. కానీ, అప్పటికే వారి పరిస్థితి విషమంగా మారింది. దీంతో కుటుంబాన్ని స్థానికంగా ఉన్న ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. అనంతరం చికిత్స పొందుతూ ఉదయం 10 గంటల సమయంలో నలుగురూ మృతిచెందారు. దీంతో ఆ కుటుంబంలో తీవ్ర విషాదం నెలకొంది. సమాచారం అందుకున్న పోలీసులు ఆసుపత్రికి చేరుకున్నారు. ఈ ఘటనపై దర్యాప్తు ప్రారంభించారు. ఫుడ్ పాయిజనింగ్ కారణం అయ్యుండొచ్చని పోలీసులు ప్రాథమికంగా అనుమానిస్తున్నారు.





# రాష్ట్రంలో దైన్యంగా రైతుల పరిస్థితి

**ధాన్యం కొనే దిక్కులేకుండా పోయింది**

**బీజేపీ ఎంపీ తేజస్వీ సూర్య వ్యాఖ్యలు దుర్మార్గం**

**ఒక్కరు కూడా ఎదిరించి మాట్లాడలేక పోయారు**

**బీఆర్ఎస్ ఎంపీలుంటే రణరంగం సృష్టించేవారు**

**తెలంగాణ భవన్‌లో బీఆర్ఎస్ అధినేత కేసీఆర్**

**హైదరాబాద్, ఏప్రిల్ 27:** రాష్ట్రంలో రైతుల పరిస్థితి దిగజారిపోయిందని మాజీ సీఎం, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ అన్నారు. ప్రభుత్వానికి ధాన్యం కొనడం చేత కావట్లేదని విమర్శించారు. పార్టీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా సోమవారం తెలంగాణ భవన్‌లో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో ఏం జరుగుతోందో అర్థం కావడం లేదు. తెలంగాణ గురించి ఎంపీ తేజస్వి సూర్య ఇష్టం వచ్చినట్లు మాట్లాడారు. ఆయన వ్యాఖ్యలపై కాంగ్రెస్, భాజపా ఎంపీలు ఒక్కమాట మాట్లాడలేదు. బీఆర్ఎస్ ఎంపీలు లోక్‌సభలో ఉండి ఉంటే రణరంగం సృష్టించేవాళ్ళు. కాళేశ్వరంపై రాజ్యసభలో సీఆర్ పాటిల్ మాట్లాడితే సురేశ్‌రెడ్డి గట్టిగా ఖండించారు. తెలంగాణ గురించి ఇష్టం వచ్చినట్లు మాట్లాడితే కాంగ్రెస్, భాజపా నేతలు ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. రాష్ట్ర విభజన సమయంలో.. హైదరాబాద్ విషయంలో రాజీ పడాలని సోనియా గాంధీ ఎన్నో సార్లు చెప్పారు. కానీ.. నేను ఎప్పుడూ రాజీ పడలేదు..అది నా చిత్తశుద్ధి అని కేసీఆర్ అన్నారు.బీజేపీ ఎంపీ తేజస్వి సూర్యపై బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ మండిపడ్డారు. డీలిమిటేషన్ బిల్లుపై చర్చ సందర్భంగా బ్రిటిషర్లు భారత్, పాకిస్థాన్‌ను వేరుచేసినట్టు అత్యంత చెత్త విధానంతో ఆంధ్రప్రదేశ్ నుంచి తెలంగాణను వేరుచేశారంటూ తేజస్వి చేసిన వ్యాఖ్యలపై ఆగ్రహం వ్యక్తం చేశారు. సభలోనే ఉన్న కేంద్రమంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్ సహా 16మంది రాష్ట్ర ఎంపీలు ఎవరూ దానిపై కనీసం అభ్యంతరం తెలుపకుండా మౌనంగా ఉన్నారని.. అదే పార్లమెంట్‌లో మన ఎంపీలు ఉండుంటే తేజస్వి సూర్య మాట్లాడిన మాటలకు రణరంగం చేసేవాళ్లు అని పార్టీ అంతర్గత సమావేశంలో అభిప్రాయపడ్డారు. ఈ 16 మంది కాంగ్రెస్, బీజేపీ ఎంపీలు తెలంగాణలో పుట్టలేదా? వాళ్లకు తెలంగాణ పౌరుషం లేదా? అని ప్రశ్నించారు. ఎంపీ తేజస్వి సూర్య అనే వెధవ మాట్లాడిన మాటలను ఎందుకు ఎండగట్టలేదని నిలదీశారు. అదే ఒక్క బీఆర్ఎస్ ఎంపీ ఉన్నా పార్లమెంట్‌లో క్షమాపణ చెప్పించేటోళ్లమని స్పష్టం చేశారు. కాంగ్రెస్, బీజేపీ ఎంపీలు మౌనంగా ఉండి పౌరుషంగా లేకుండా వ్యవహరించారని మండిపడ్డారు. ఒకప్పుడు తెలంగాణ రాష్ట్రాన్ని వ్యవసాయ రంగం నుంచి ఇతర అన్ని రంగాల్లో నంబర్‌వన్‌గా నిలబెట్టామని కేసీఆర్ తెలిపారు. కానీ ఈ ప్రభుత్వం భూముల కబ్జాల్లో నంబర్‌వన్, కూలగొట్టడంలో నంబర్‌వన్‌గా నిలబెట్టే ప్రయత్నం చేస్తుందని పేర్కొన్నారు. ఈ ప్రభుత్వం ధాన్యం కొనుగోలు చేయలేని స్థితిలో చేతకానితనంతో ఉన్నదని మండిపడ్డారు. ధాన్యం కొనుగోళ్లు లేకపోవడం వల్ల రైతన్నలు పడుతున్న ఇబ్బందులు చూస్తుంటే తీవ్రంగా బాధ అవుతుందని అన్నారు. చిల్లర కూతలు, చిల్లర మాటలు మాట్లాడుతున్న ముఖ్యమంత్రి, మంత్రులను చూస్తే జాలి వేస్తుందని అన్నారు. ఇక ఈ అంతర్గత సమావేశంలోనే జీవన్ రెడ్డిని బీఆర్ఎస్ కార్యవర్గానికి పరిచయం చేశారు. ఈ సందర్భంగా జీవన్ రెడ్డిని పార్టీ జనరల్ సెక్రటరీగా ప్రకటించారు.

# బీఆర్ఎస్ సంస్థాగత ప్రక్షాళన

**అన్ని స్థాయిల కమిటీల రద్దుకు కేసీఆర్ ఆదేశం!**

**కేటీఆర్‌కు కీలక బాధ్యతలు..**

**త్వరలోనే కొత్త కమిటీల నియామకం**



**హైదరాబాద్, ఏప్రిల్27 :** భారత్ రాష్ట్ర సమితి (బీఆర్ఎస్) పార్టీని క్షేత్రస్థాయి నుంచి బలోపేతం చేసే దిశగా పార్టీ అధినేత కేసీఆర్ కీలక నిర్ణయం తీసుకున్నారు. సోమవారం తెలంగాణ భవన్‌లో జరిగిన రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో పార్టీ సంస్థాగత నిర్మాణానికి సంబంధించి ఆయన సంచలన ఆదేశాలు జారీ చేశారు. పార్టీ రాష్ట్ర స్థాయి కార్యవర్గం మినహా, ప్రస్తుతం ఉన్న అన్ని స్థాయిల కమిటీలను రద్దు చేస్తున్నట్లు ప్రకటించారు. పార్టీని మరింత చైతన్యవంతం చేసేందుకు మరియు నూతన నాయకత్వానికి అవకాశం కల్పించేందుకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం. త్వరలోనే గ్రామ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు అన్ని విభాగాలకు కొత్త కమిటీలను నియమించాలని, ఈ ప్రక్రియను వేగవంతం చేయాలని ఆదేశించారు. పార్టీ పునర్నిర్మాణం, కమిటీల నియామక ప్రక్రియలో పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌కు కేసీఆర్ అత్యంత కీలక బాధ్యతలను అప్పగించారు. కొత్తగా నియామకమయ్యే కమిటీ సభ్యులు, నాయకులకు పార్టీ సిద్ధాంతాలు, భవిష్యత్ కార్యాచరణపై ప్రత్యేక శిక్షణ తరగతులు నిర్వహించాలని సూచించారు. ఈ శిక్షణ శిబిరాల బాధ్యతను కూడా కేటీఆర్ పర్యవేక్షించనున్నారు. పార్టీ శ్రేణుల్లో ఉత్సాహం నింపేలా శిక్షణా కార్యక్రమాల రూపకల్పన ఉండాలని, నాయకత్వ లక్షణాలను పెంపొందించేలా తరగతులు నిర్వహించాలని కేసీఆర్ దిశానిర్దేశం చేశారు.

**డిజిటల్ సభ్యత్వ నమోదు**

పార్టీ సభ్యత్వ నమోదు ప్రక్రియను తక్షణమే ప్రారంభించాలని కేసీఆర్ స్పష్టం చేశారు. ఈసారి సభ్యత్వ నమోదు కేవలం పుస్తకాలకే పరిమితం కాకుండా, మారుతున్న కాలానికి అనుగుణంగా ఆన్‌లైన్ మరియు ఆఫ్‌లైన్ విధానాల్లో నిర్వహించాలని ఆదేశించారు. సభ్యులు తమ వివరాలను సులభంగా నమోదు చేసుకునేలా డిజిటల్ పద్ధతులకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. పార్టీ కేడర్‌ను డిజిటల్ నెట్‌వర్క్‌తో అనుసంధానం చేయడం ద్వారా కమ్యూనికేషన్ వేగంగా జరుగుతుందని ఆయన అభిప్రాయపడ్డారు. పార్టీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా తీసుకున్న ఈ నిర్ణయాలతో బీఆర్ఎస్ శ్రేణుల్లో కొత్త ఉత్సాహం నెలకొంది.

# ప్రతి కుటుంబం వివరాలు నమోదు చేసుకోవాలి

**జనగణనలో డిప్యూటీ సీఎం భట్టి**



**ఖమ్మం, ఏప్రిల్ 27:** రాష్ట్రంలోని ప్రజలందరు జనగణనలో భాగస్వాములు కావాలని ఈ సందర్భంగా ఉప ముఖ్యమంత్రి పిలుపునిచ్చారు. ప్రజలంతా తమ వివరాలను స్వయంగా ఆన్‌లైన్‌లో నమోదు చేసుకునే విధానాన్ని ప్రోత్సహిస్తూ ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క స్వయంగా ఈ పక్రియను పూర్తి చేశారు. ఈ విధానం ద్వారా జనగణనలో సమాచార సేకరణ సులభతరం అవుతుందని ఆయన పేర్కొన్నారు. తెలంగాణలో జనగణన 2027 పక్రియలో భాగంగా, ప్రతి కుటుంబం తమ వివరాలను ఖచ్చితంగా నమోదు చేసుకోవాలని చెప్పారు. దీని ద్వారా ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు ప్రజలకు సరిగ్గా అందుతాయని ఉప ముఖ్యమంత్రి ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఖమ్మం జిల్లా కలెక్టర్ టీఎస్ దివాకర, చీఫ్ ప్లానింగ్ అధికారి శ్రీనివాస్, టెక్నీకల్ అసిస్టెంట్ హిమవర్ష తదితరులు పాల్గొన్నారు.

# బెంగాల్ ప్రచారం ఎంతో ఉత్సాహాన్ని ఇచ్చింది

**బీజేపీ ప్రభుత్వ ఏర్పాటుకు కలసి రావాలి**

**బెంగాల్ ప్రజలకు ప్రధాని మోడీ బహిరంగ లేఖ**

**న్యూఢిల్లీ, ఏప్రిల్ 27:** పశ్చిమబెంగాల్ అసెంబ్లీ ఎన్నికల రెండో విడత ప్రచారానికి సోమవారం సాయంత్రం తెరపడటంతో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ రాష్ట్ర ప్రజలకు బహిరంగ లేఖ రాశారు. రాష్ట్రంలో తాను జరిపిన విస్తృత పర్యటన రాజకీయంగా, ఆధ్యాత్మిక ఎదుగుదల పరంగా తనకెంతో ఉపకరించిందని ఆ లేఖలో పేర్కొన్నారు. బీజేపీ రాష్ట్రాభివృద్ధి రోడ్‌మ్యాప్‌ను రాష్ట్ర ప్రజల ముందు ఉంచానని, అయినప్పటికీ ఈ లేఖ ద్వారా తన మనోభావాలని రాష్ట్ర ప్రజలందరితోనూ పంచుకోవాలని అనుకుంటున్నానని చెప్పారు. బెంగాల్ సోదర, సోదరీమణుల్లారా అంటూ ప్రధాని తన లేఖను ప్రారంభించారు. ఎన్నికల ప్రచారంలో అసాధారణ శక్తిని తాను అనుభూతి పొందానని, తీవ్రమైన వేడి, వరుస ర్యాలీల్లో పాల్గొన్నప్పటికీ తనకెలాంటి అలసట రాలేదని చెప్పారు. 'ఈ ర్యాలీలు, రోడ్‌షోలు నాకొక యాత్రలాంటి అనుభూతినిచ్చింది. మా కాళి భక్తులతో కలిసి నేను ఎప్పుడు వెళ్లినా ఆ తల్లి నాలో రెట్టించిన



శక్తిని నింపుతున్నట్టు అనిపిస్తుంది. 2024 జనవరిలో అయోధ్యలో రామ్‌లల్లా ప్రతిష్ఠాపన జరిగిన 11 రోజులు ఉపవాసం చేశాను. అప్పటిలాగా బెంగాల్ ప్రచారంలో కూడా అలాంటి ఆధ్యాత్మిక అనుభూతే నాకు కలిగింది' అని మోదీ వెల్లడించారు. బెంగాల్‌లో పాల్గొన్న ర్యాలీలు, రోడ్‌షోలలో ప్రజల నుంచి హృదయాన్ని కదలించే ఎన్నో మెసేజ్‌లు, ఫోటోలు తనకు అందాయని, వాటిని ఎప్పటికీ మరచిపోలేనని మోదీ తెలిపారు. ఎంత అర్ధరాత్రయినవీలు చూసుకుని వాటిని చదవడంతో పాటు స్పందిస్తుంటానని చెప్పారు. యువకులు, మహిళలు, ఆడకూతుళ్లు, పెద్దలు సహా అన్ని వయస్సుల వారు చూపిస్తున్న ఆదరణ మరువలేనని, వారే తనకు అత్యంత విలువైన సంపద అని అభివర్ణించారు. బెంగాల్ సత్వర అభివృద్ధిని ప్రజలు కోరుకుంటున్న విషయం తాను గ్రహించానని, యువత ప్రగతిపథం వైపు దూసుకువెళ్లే అవకాశాల కోసం, ఆడకూతుళ్ల ఆకాశవే హద్దుగా అవకాశాలు అందిపుచ్చుకోవడం, భద్రత కోసం ఎదురుచూస్తున్నారని, రాష్ట్ర ప్రజలంతా మార్పు కావాలనే ఏకైక సంకల్పంతో ఉన్నారని చెప్పారు. ప్రజలు బీజేపీని విశ్వసిస్తున్నారని తెలిపారు. సురక్షిత బెంగాల్‌కు తాను బాధ్యత తీసుకుంటానని, సవాళ్లను అవకాశాలుగా మార్చేందుకు తాను కృతనిశ్చయంతో ఉన్నానని చెప్పారు. 'రాష్ట్రంలో బీజేపీ ప్రభుత్వ ప్రమాణస్వీకారానికి ప్రజలంతా కలిసివస్తారనే నమ్మకం నాకుంది. మనమంతా కలిసి అభివృద్ధి చెందిన బెంగాల్‌ను నిర్మించుకుందాం' అంటూ ప్రధాని ఆ లేఖను ముగించారు.



# మహాలింగాపురంలో కూలిన భారీ క్రేన్

**ఐదుగురు కార్మికుల దుర్మరణం**

**ఎన్‌సీసీ సిమెంట్ బ్రిక్స్ కంపెనీలో విషాదం..**

**మరో 12 మందికి తీవ్ర గాయాలు**

**ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఒకరి మృతి..**

**శంకరపల్లి:** రంగారెడ్డి జిల్లా శంకరపల్లి మండలం మహాలింగాపురంలో సోమవారం ఘోర ప్రమాదం సంభవించింది. స్థానిక ఎన్‌సీసీ సిమెంట్ బ్రిక్స్ కంపెనీలో పనులు జరుగుతుండగా ఒక్కసారిగా భారీ క్రేన్ కూలిపోవడంతో ఐదుగురు కార్మికులు మృత్యువాత పడ్డారు. ప్రమాదం జరిగిన వెంటనే నలుగురు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోగా, తీవ్రంగా గాయపడి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న మిథున్ అనే కార్మికుడు పరిస్థితి విషమించి మృతి చెందాడు. దీంతో ఈ ఘటనలో మొత్తం మృతుల సంఖ్య ఐదుకు చేరుకుంది. మృతులను అలీ హుస్సేన్ (35), నాగేంద్ర (30), సాజిద్ (32), మిథున్ మరియు సోనుగా గుర్తించారు. ఈ ప్రమాద సమయంలో అక్కడ మొత్తం 17 మంది కార్మికులు పనిచేస్తున్నట్లు సమాచారం. క్రేన్ కూలిన సమయంలో పెద్ద శబ్దం రావడంతో చుట్టుపక్కల వారు భయాందోళనలకు గురయ్యారు. భారీ యంత్రం ఒక్కసారిగా కార్మికులపై పడటంతో 12 మందికి తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రులను వెంటనే శంకరపల్లిలోని స్థానిక ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం చేవెళ్ల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. క్షతగాత్రుల్లో కొందరి పరిస్థితి ఇంకా విషమంగానే ఉన్నట్లు సమాచారం. ప్రమాద ధాటికి క్రేన్ భాగాలు తునాతునకలయ్యాయని, సహాయక చర్యలు చేపట్టే సమయానికి కార్మికులు శిథిలాల కింద చిక్కుకుపోయారని ప్రత్యక్ష సాక్షులు తెలిపారు.

**ఘటనా స్థలాన్ని పరిశీలించిన అధికారులు**

ప్రమాదంపై సమాచారం అందుకున్న వెంటనే పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలను పర్యవేక్షించారు. కంపెనీలో భద్రతా ప్రమాణాలు పాటించకపోవడం వల్లే ఈ ప్రమాదం జరిగిందా? లేదా సాంకేతిక లోపం ఉందా? అనే కోణంలో పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. ప్రమాద సమయంలో అక్కడ పనిచేస్తున్న ఇతర కార్మికుల నుంచి వివరాలను సేకరిస్తున్నారు. నిబంధనల ఉల్లంఘన జరిగినట్లు తేలితే సంబంధిత కంపెనీ యాజమాన్యంపై కఠిన చర్యలు తీసుకుంటామని అధికారులు హెచ్చరించారు. కాయకష్టమే నమ్ముకుని వచ్చిన కార్మికులు ఇలా ప్రమాదానికి గురై మరణించడం వారి కుటుంబాల్లో తీరని వేదనను మిగిల్చింది.


# బ్రేక్ అప్ తరవాత అత్యాచార కేసులు కుదరవు

**తేల్చి చెప్పిన సుప్రీం ధర్మాసనం**

**న్యూఢిల్లీ, ఏప్రిల్ 27:** సహజీవనం తర్వాత అత్యాచారం కేసులు పెట్టడం సరికాదని సుప్రీంకోర్టు ధర్మాసనం తెలిపింది. బ్రేక్-అప్ తర్వాత లైంగిక దాడి ఆరోపణలు వర్తించవని పేర్కొంది. పరస్పర అంగీకారంతో కూడిన సంబంధం నేరం కిందకు రాదని న్యాయస్థానం తేల్చిచెప్పింది. పెళ్లి చేసుకోలేదని కక్షపూరితంగా కేసులు పెట్టడం సరికాదని ధర్మాసనం సూచించింది. తప్పుడు వాగ్దానం, విఫలమైన వాగ్దానాల మధ్య తేడాను గుర్తించాలని కేసు విచారణ సందర్భంగా పిటిషనర్‌కు తెలిపింది. ఈ మేరకు మహారాష్ట్ర న్యాయవాదిపై నమోదైన అత్యాచారం కేసును సుప్రీంకోర్టు కొట్టివేసింది. ఇద్దరి వ్యక్తుల బంధంలో ప్రారంభం నుంచీ మోసపూరిత ఉద్దేశం ఉంటేనే నేరం కిందకు వస్తుందని సుప్రీంకోర్టు ధర్మాసనం తెలిపింది.

# అంబర్‌పేట చౌరస్తాలో భారీ అగ్నిప్రమాదం

**దగ్ధమైన రెండు కారు షోరూమ్‌లు**



**హైదరాబాద్, ఏప్రిల్ 27:** అంబర్‌పేట్ చౌరస్తాలోని రెనో, మహీంద్ర షోరూమ్స్‌లో సోమవారం భారీ అగ్నిప్రమాదం సంభవించింది. మంటలు భారీగా ఎగిసిపడ్డాయి. ప్రమాదాన్ని పసిగట్టిన వెంటనే షోరూమ్ యజమానులు.. అగ్నిమాపక సిబ్బందితోపాటు పోలీసులకు సమాచారం అందించారు. హుటాహుటిన సంఘటన స్థలానికి చేరుకున్న ఫైర్ సిబ్బంది.. మంటలార్పుతున్నారు. ప్రమాదానికి గురైన షోరూమ్స్ వెనుక వైపు గృహసముదాయాలు ఉన్నాయి. అగ్నికీలలు ఎగసిపడుతుండటం, ప్రమాద తీవ్రత అధికంగా ఉండటంతో.. షోరూమ్స్‌కి ఆనుకుని ఉన్న ఇళ్లలోని ప్రజలను పోలీసులు ఖాళీ చేయించారు . అగ్ని ప్రమాదం కారణంగా ఆ ప్రాంతమంతా దట్టమైన పొగ కమ్మేసింది. దీంతో స్థానికులు తీవ్ర భయాందోళనకు గురయ్యారు. ఈ అగ్ని ప్రమాదానికి షార్ట్ సర్క్యూట్ కారణమని అధికారులు భావిస్తున్నారు. ప్రమాదంపై పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు. అగ్నిప్రమాదం కారణంగా.. షోరూమ్‌లోని వాహనాలన్నీ దగ్ధమయ్యాయని.. భారీగా ఆస్తి నష్టం కలిగిందని షోరూమ్ యజమానులు తెలిపారు.



సంపాదకీయం

# శాంతి చర్చల పేరుతో దొంగాట!

ప్రపంచం శాంతిగా ఉండడం అటు అమెరికాకుకు, ఇటు ఇజ్రాయిల్‌కు ఇష్టం లేనట్లుగా ఉంది. తానో శాంతి కాముకుడినని చెప్పుకున్న ట్రంప్ చేస్తున్న చర్యలు తీసుకుంటున్న నిర్ణయాలు ప్రపంచాన్ని అశాంతిలోకి నెట్టాయి. దాదాపు రెండు నెలలు కావస్తుందో. ఇరాన్‌పై దాడిని ప్రారంభించిన ఫిబ్రవరి 28 నుంచి ఎప్రిల్ 28 వరకు ..పరిస్థితులు గమనిస్తూ ఇద్దరూ రావణ కుంభకర్ణుల్లా ప్రపంచం మీద విరుచుకు పడుతున్నారు. ఇరాన్ ప్రత్యక్షంగా మిగతా దేశాలు పరోక్షంగా తీవ్రంగా దెబ్బతింటున్నాయి. అయినా రక్తం మరిగిన పులిలా ఈ ఇద్దరూ తమ పంతాన్ని వీడడం లేదు. యుద్ధ ముగింపు కోసం ఆడుతున్న నాటకాలు ప్రజలు గమనిస్తు న్నారు. శాంతి చర్చల పేరిట ఇరాన్‌ను గుప్పిట పెట్టుకోవాలని చూస్తున్నారు. గల్ఫ్ చమురు ఉత్పత్తిలో ఎదురవుతున్న అంతరాయం అంతర్జాతీయ ఇంధన మార్కెట్లను కుదిపేస్తోంది. మధ్యప్రాచ్యంలో ఘర్షణలు తలెత్తడానికి ముందు ఉత్పత్తి అయిన ముడి చమురుతో పోలిస్తే రోజుకు సుమారు 14.5 మిలియన్ బ్యారల్స్ ఉత్పత్తి నిలిచిపోయింది. అంటే ఘర్షణకు ముందు జరిగిన ఉత్పత్తిలో 57 శాతం పడిపోయిందని తెలుస్తోంది. పనిలోపనిగా భారత్ చైనాలను నరక కూపాలని ట్రంప్ చేసిన వ్యాఖ్యలు ఆయన మూర్ఖత్వాన్ని బయటపెట్టాయి. ఇరాన్‌పై ఒత్తడి పెంచడం తప్ప ఇప్పటి వరకు జరిగిన చర్చల్లో ఎలాంటి పురోగతి లేదు. రసాయన ఆయుధాలు ఉన్నాయని గతంలో ఇరాక్‌పై దాడి చేసి, ఇరాక్ అధ్యక్షుడు సద్దం హుస్సేన్‌ను బలి తీసుకున్నారు. అక్కడ రసాయన ఆయుధాలు లేవని తేలింది. ఇప్పుడు ఇరాన్‌లో యురేనియం ఉందని, అణ్వాయుధాలు ఉన్నాయని బుకాయించి ఇరాన్‌పై పనిగట్టుకుని దాడి చేశారు. దేశాధినేత ఖమేనని మట్టుపెట్టారు. రెండు నెలలుగా ప్రపంచ వ్యాప్తంగా చమురు సంక్షోభం ఏర్పడ్డా పట్టించుకోవడం లేదు. స్వదేశంలో ట్రంప్‌కు విపరీతమైన వ్యతిరేకత వస్తున్నా లెక్క చేయడం లేదు. ఈ క్రమంలో ఇస్లామాబాద్ వేదికగా శాంతి చర్చలు ముందుకు సాగడం లేదు. అమెరికా, ఇజ్రాయిల్ డబుల్‌గేమ్ ఆడుతున్నాయనే చర్చ నడుస్తోంది. ఓ వైపు శాంతి చర్చలంటూ దౌత్యం నడుపుతూ.. మరోవైపు అరేబియా సముద్రంలో అమెరికా యుద్ధ నౌకల్ని మోహరింప జేస్తోంది. హర్మూజ్‌పై పట్టు సాధించే ప్రయత్నం చేస్తోంది. ఇరాన్‌ను దిగ్బంధించే యత్నాలను యానుకో లేదు. ఇరాన్, అమెరికా మధ్య చాలా అంశాల్లో ఏకాభిప్రాయం కుదిరినా, కొన్ని విషయాలు ఒప్పందానికి అడ్డంకిగా మారాయని తెలుస్తోంది. ముఖ్యంగా 20 ఏళ్ల పాటు యురేనియం శుద్ధిని నిలిపివేయాలన్న అమెరికా డిమాండ్‌ను ఇరాన్ అంగీకరించాల్సిందేనని ట్రంప్ పట్టుబడుతున్నారు. ఇదే అంశంపై విలేకరులతో మాట్లాడుతూ ఇరాన్ ఎప్పటికీ అణ్వాయుధాలను తయారు చేయకూడదన్నదే తమ ఏకైక లక్ష్యమని ట్రంప్ వెల్లడించారు. లెబనాన్‌లో కాల్పుల విరమణ ప్రకటించినా, ఇజ్రాయిల్ వైమానిక దాడులతో జనావాసాలపై విరుచుకుపడుతూనే ఉంది. ఇలాంటి పరిస్థితుల్లో అమెరికాతో శాంతి చర్చలపై అనిశ్చితి నెలకొన్నదని ఇరాన్ అధ్యక్షుడు మసూద్ పెజెష్కియాన్ కీలక వ్యాఖ్యలు చేశారు. అమెరికా విధిస్తున్న ఇరాన్ ఓడరేవుల దిగ్బంధనం, బెదిరింపుల నడుమ ఆ దేశంతో చర్చలు అసాధ్యమని తేల్చి చెప్పారు. ఇదే విషయాన్ని పాకిస్తాన్ ప్రధాని షెహబాజ్ షరీఫ్‌తో పెజెష్కియాన్ ఫోన్‌లో మాట్లాడారు.శాంతి చర్చలపై ఇరాన్ వైఖరిని స్పష్టం చేశారు. ఇరాన్ తన సార్వభౌమాధికారాన్ని వదులుకోదని, అలాగే ఒత్తిళ్లకు తలొగ్గి ఒప్పందాలు చేసుకోబోదని పెజెష్కియాన్ స్పష్టం చేశారు. ప్రస్తుత ఉద్రిక్తతలకు అమెరికానే కారణమని పెజెష్కియాన్ పేర్కొన్నారు. అమెరికా అనుసరిస్తున్న చర్యలే చర్చలకు ప్రధాన అడ్డంకి ఆయన పాక్ ప్రధానితో చెప్పినట్లు ఓ మీడియా వెల్లడించింది. ఏప్రిల్ 13 నుంచి ఇరాన్ ఓడరేవులను అమెరికా నౌకాదళం దిగ్బంధించిన విషయం తెలిసిందే. ఈ పరిణామం వల్ల ఇరాన్ ఆర్థికంగా తీవ్రమైన ఇబ్బందులను ఎదుర్కొంటోంది. ఇలాంటి దిగ్బంధనాల నడుమ పరస్పర నమ్మకాన్ని పునరుద్ధరించడం అసాధ్యమని పేజెష్కియాన్ వెల్లడించారు. అందుకే ఇరు దేశాల మధ్య చర్చలు జరగాలంటే ముందుగా అమెరికా ఆంక్షలను తొలగించి, చిత్తశుద్ధిని నిరూపించుకోవాల్సి ఉంటుందని స్పష్టం చేశారు.ఇరాన్ వద్ద అణ్వాయుధాలు ఉండకూడదన్న తన షరతును ట్రంప్ ఈ సందర్భంగా పునరుద్ఘాటించారు. ఇరాన్ తమను టెలిఫోన్‌లో సంప్రదించవచ్చునని, వారు ఎప్పుడు కోరుకుంటే అప్పుడు మాట్లాడవచ్చునని ట్రంప్ చెప్పారు. హోర్ముజ్ జలసంధి నుంచి మందుపాతరలను తొలగించే పనిలో అమెరికా నౌకాదళం నిమగమైందని ట్రంప్ తెలిపారు. ఇస్లామాబాద్ నుంచి వెళ్లిపోయిన తర్వాత ఇరాన్ విదేశాంగమంత్రి అబ్బాస్ అరాగ్చి స్పందించారు. ఇప్పటికే తాము ఒక ఫ్రేమ్ వర్క్‌ను పాకిస్తాన్‌కు అందించామని తెలిపారు. యుద్ధాన్ని శాశ్వతంగా ముగించేందుకు ఇది ఒక మంచి మార్గమని ఆయన చెప్పారు. శాంతి చర్చలపై అమెరికాకు నిజంగా ఆసక్తి ఉందా అన్నది అనుమాన మేనని కూడా అన్నారు. ఇకపోతే త్తిడి, బెదిరింపు, స్వాధీనాల నడుమ ఒప్పందం ఎలా సాధ్యపడుతుందని ఇరాన్ అధ్యక్షుడు మసూద్ పెజెష్కియాన్ ప్రశ్నించారు. పాకిస్తాన్ ప్రధాని షెహబాజ్ షరీఫ్‌తో జరిపిన టెలిఫోన్ సంభాషణ సందర్భంగా ఆయన ఈ వ్యాఖ్య చేశారని ఇరాన్‌కు చెందిన మెహర్ వార్తా సంస్థ తెలిపింది. చర్చలు, కాల్పుల విరమణ సందర్భాల్లో అమెరికా పదేపదే ఉల్లంఘనలకు పాల్పడుతూనే ఉన్నదని, నిర్బంధాలకు తెగబడుతోందని ఆయన అన్నారు. ఇరాన్ ఓడరేవులపై నిషేధం కాల్పుల విరమణ అవగాహనకు తూట్లు పొడవడమేనని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇరాన్ శుద్ధి చేసిన 400 కిలోల యురేనియంను తనకు అప్పగించాలని అమెరికా కోరుతుండగా ఇరాన్ ససేమిరా అంటోంది. ఇరాన్ ఓడరేవులపై అమెరికా ఆంక్షలు ఎత్తివేసే వరకూ హార్ముజ్ జలసంధిని దిగ్బంధిస్తామని ఇరాన్ తేల్చి చెప్పింది. ఒప్పందం కుదిరే వరకూ నిర్బంధం కొనసాగుతుందని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ అంటున్నారు. మొత్తంగా చర్చల పీటముడి వీడేలా లేదు. ప్రపంచం ప్రశాంతంగా నిద్రపోయేలా కూడా లేదు.

# ఏడుగురు ఆప్ ఎంపీల విలీనానికి రాజముద్ర

- వీరంతా బీజేపీలో చేరినట్లుగా గుర్తించిన ఛైర్మన్
- రాజ్యసభలో 113కు చేరిన బీజేపీ సంఖ్యాబలం



**న్యూఢిల్లీ, ఏప్రిల్ 27:** ఆమ్ ఆద్మీ పార్టీకి చెందిన ఏడుగురు రాజ్యసభ సభ్యులు బీజేపీలో విలీనమవ్వడానికి రాజ్యసభ ఛైర్మన్ సీపీ రాధాకృష్ణన్ ఆమోదం తెలిపారు. ఈ నిర్ణయంతో రాజ్యసభలో రాజకీయ సమీకరణాలు పూర్తిగా మారిపోయాయి. ఈ విలీనంతో బీజేపీ సంఖ్యాబలం 113కి పెరిగింది. ఆప్ సభ్యుల సంఖ్య గణనీయంగా తగ్గింది. ఆప్ నుంచి రాఘవ్ చద్దా, సాందీప్ పాఠక్, అశోక్ మిట్టల్, హర్భజన్ సింగ్, స్వాతీ మాలివాల్ సహా ఏడుగురు రాజ్యసభ సభ్యులు బీజేపీలోకి ఫిరాయించారు. వీరి విలీనానికి రాజ్యసభ ఛైర్మన్ ఆమోదం తెలపడంతో వారంతా బీజేపీ సభ్యులయ్యారు. విలీనం తర్వాత తమను బీజేపీ ఎంపీలుగానే పరిగణించాలని కోరుతూ ఈ ఏడుగురూ రాజ్యసభ ఛైర్మన్‌కు వినతి పత్రం సమర్పించారు. దానికి తాజాగా ఆమోదం లభించింది. కాగా, తమ పార్టీ నుంచి బీజేపీలోకి ఫిరాయించిన ఏడుగురు రాజ్యసభ ఎంపీలను సస్పెండ్ చేయాలని కోరుతూ ఆప్ ఆదివారం రాజ్యసభ ఛైర్మన్‌కు వినతిపత్రం సమర్పించింది. కేంద్ర సంస్థలను ఉపయోగించి తమ నాయకులను ఒత్తిడి చేసి బీజేపీలోకి చేర్చుకున్నారని ఆరోపించింది. ఈ అంశంపై చట్టపరమైన పోరాటం కూడా కొనసాగుతుందని తెలిపింది. ఆ పార్టీకి చెందిన ఏడుగురు ఎంపీలు ఇటీవల బీజేపీలో చేరిన విషయం తెలిసిందే. అయితే ఆ విలీన ప్రక్రియను సోమవారం రాజ్యసభ ఛైర్మన్ సీపీ రాధాకృష్ణన్ ఆమోదించారు. దీంతో రాజ్యసభ వెబ్‌సైట్ ప్రకారం.. ఆమ్ ఆద్మీ పార్టీ ఎంపీల సంఖ్య 10 నుంచి మూడుకు పడిపోయింది. ఇక బీజేపీ సంఖ్య 106 నుంచి 113కు చేరింది. ఇక రాజ్యసభలో ఎన్డీఏ బలం ఇప్పుడు 141 నుంచి 148కి పెరిగింది. దీంతో రాజ్యసభలో మెజారిటీ మార్క్ అయిన 123 సంఖ్యకు బీజేపీ చేరువ అవుతున్నట్లు తెలుస్తోంది. బీజేపీలో చేరినట్లు ఆమ్ ఆద్మీ పార్టీలు సమర్పించిన విలీన లేఖపై రాజ్యసభ ఛైర్మెన్ రాధాకృష్ణన్ న్యాయపరమైన అభిప్రాయాన్ని తీసుకున్నట్లు తెలుస్తోంది. ఏడుగురు ఆప్ ఎంపీలు ఆ లేఖపై సంతకం చేశారు. అయితే ఆ పార్టీకి చెందిన రాజ్యసభ ఎంపీల సంఖ్యలో 2/3 మెజారిటీ ఉన్నది. దీంతో ఎంపీల విలీన ప్రక్రియకు దాదాపు క్లియరెన్స్ వచ్చేసింది. రాఘవ్ చద్దా, సందీప్ పాతక్, స్వాతి మాలివాల్, హర్భజన్ సింగ్, విక్రమ్‌జీత్ సాహ్నే, అశోక్ మిట్టల్, రాజేందర్ గుప్తాలు బీజేపీలో చేరారు. ఆప్ ఎంపీలు రాసిన లేఖ రాజ్యాంగంలోని పదవ షెడ్యూల్‌కు తగినట్లు ఉందని రాజ్యసభ్య ఛైర్మెన్ భావిస్తున్నట్లు తెలిసింది. ఆ షెడ్యూల్ ప్రకారం 2/3 మెజారిటీ ఉంటే, విలీనాన్ని ఆమోదించవచ్చు. మరోవైపు ఆ ఏడుగురు ఎంపీలను అనర్హులుగా ప్రకటించాలని ఆమ్ ఆద్మీ పార్టీ రాజ్యసభ ఛైర్మెన్‌ను కోరిన విషయం తెలిసిందే.

# కోర్టుపై తనకు నమ్మకం పోయింది

- అందుకే మీరు ఉన్నంత వరకు హాజరు కాను
- ఢిల్లీ హైకోర్టు న్యాయమూర్తిపై కేజ్రీవాల్ వ్యాఖ్యలు
- ఈ మేరకు లేఖ విడుదలచేసిన కేజ్రీవాల్



**న్యూఢిల్లీ, ఏప్రిల్ 27:** ఢిల్లీ మద్యం విధానం కేసులో ఆమ్ ఆద్మీ పార్టీ జాతీయ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్ అనూహ్య నిర్ణయం తీసుకున్నారు. ఈ కేసును విచారిస్తున్న ఢిల్లీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ స్వర్ణకాంత శర్మ ఎదుట హాజరుకావడానికి ఆయన నిరాకరించారు. ఈ మేరకు ఆయన న్యాయమూర్తికి ఒక లేఖ రాస్తూ, కోర్టుపై తనకు 'నమ్మకం పోయిందని' సంచలన వ్యాఖ్యలు చేశారు. తన అంతరాత్మ ప్రభోదం మేరకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు కేజ్రీవాల్ వెల్లడించారు. 'న్యాయం జరుగుతుందన్న ఆశలు ఆవిరయ్యాయి. అందుకే మహాత్మా గాంధీ చూపిన సత్యాగ్రహ మార్గంలో నడవాలని నిర్ణయించుకున్నాను. వ్యక్తిగతంగా గానీ, కనీసం నా తరఫు న్యాయవాది ద్వారా గానీ విచారణకు హాజరుకాను' అని ఆయన లేఖలో పేర్కొన్నారు. అయితే, చట్టపరంగా తనకు ఉన్న హక్కుల ప్రకారం ఈ వ్యవహారంపై సుప్రీంకోర్టును ఆశ్రయిస్తానని ఆయన స్పష్టం చేశారు. ఇదిలా ఉంటే, సోమవారం విచారణకు కేజ్రీవాల్ గైర్హాజరు కావడంతో హైకోర్టు తదుపరి ఎలాంటి చర్యలు తీసుకుంటుందనేది ఆసక్తికరంగా మారింది. ఒకవైపు బెంగాల్ ఎన్నికల వేడి, మరోవైపు కేజ్రీవాల్ చుట్టూ తిరుగుతున్న ఈ న్యాయ వివాదాలు దేశ రాజకీయాల్లో వేడిని పెంచుతున్నాయి.మద్యం పాలసీ కేసులో కేజ్రీవాల్‌తో పాటు ఇతర నిందితులను ట్రయల్ కోర్టు గతంలో విడుదల చేసింది. దీనిని సవాలు చేస్తూ సీబీఐ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. ఈ పిటిషన్‌ను జస్టిస్ స్వర్ణకాంత శర్మ విచారిస్తున్నారు. అయితే, ఈమె గతంలో కేజ్రీవాల్ అరెస్ట్‌ను సమర్థిస్తూ తీర్పునిచ్చారని, అలాగే ఆమె కుటుంబ సభ్యులకు ప్రభుత్వంతో సంబంధాలు ఉన్నాయని ఆరోపిస్తూ.. ఈ కేసు నుంచి ఆమె తప్పుకోవాలని కేజ్రీవాల్ పిటిషన్ వేశారు. గత ఏప్రిల్ 20 ఈ పిటిషన్‌ను జస్టిస్ స్వర్ణకాంత శర్మ కొట్టివేశారు. 'న్యాయమూర్తుల నిజాయతీని లిటిగెంట్లు విచారించలేరు. కేవలం ఊహల ఆధారంగా రీక్యూసల్ కోరలేరు' అని ఆమె ఘాటుగా వ్యాఖ్యానించారు. ఎన్నికల సమయంలో ఒక మాజీ ముఖ్యమంత్రి హోదాలో ఉన్న వ్యక్తి, స్వయంగా న్యాయమూర్తికి వ్యతిరేకంగా ఇలాంటి నిర్ణయం తీసుకోవడం దేశవ్యాప్తంగా చర్చనీయాంశమైంది. న్యాయవ్యవస్థపై కేజ్రీవాల్‌కు గౌరవం లేదని బీజేపీ విమర్శిస్తుంటే, తమ నాయకుడికి అన్యాయం జరుగుతోందని ఆప్ నేతలు ఆరోపిస్తున్నారు.

# మహిళా న్యాయవాదిపై భర్త కత్తితో దాడి

- సుమోటోగా విచారణ చేపట్టిన సుప్రీంకోర్టు
- సమగ్ర దర్యాప్తునకు ఢిల్లీ పోలీసులకు ఆదేశం



న్యూఢిల్లీ, ఏప్రిల్ 27: మహిళా న్యాయవాదిపై భర్త కత్తితో దాడి చేసిన ఘటనపై దేశ అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. ఈ ఘటనను సుమోటోగా విచారణకు స్వీకరించింది. భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్య కాంత్, జస్టిస్ జోయ్‌మాల్యా బాగ్చీతో కూడిన ధర్మాసనం సోమవారం ఈ ఘటనపై సంక్షిప్త విచారణ చేపట్టింది. కేసు రిజిస్టర్ చేసి సీనియర్ అధికారిణులతో దర్యాప్తు చేయించాలని ఢిల్లీ పోలీస్ కమిషనర్‌ను ధర్మాసనం ఆదేశించింది. ఎస్పీ లేదా డీఎస్పీ ర్యాంకు అధికారిణులతో మాత్రమే దర్యాప్తు చేయించాలని స్పష్టం చేసింది. బాధితురాలి తరఫున అడ్వకేట్ స్నేహ కలిత బెంచ్ ముందు మాట్లాడుతూ.. 'ఓ మహిళా న్యాయవాది అతి దారుణంగా కత్తి దాడికి గురయ్యారు. అది కూడా భర్త ఆఫీస్‌లో ఆమె కత్తి దాడికి గురయ్యారు. ఆమె చికిత్స కోసం మూడు ఆస్పత్రుల దగ్గరకు వెళితే.. చికిత్స చేయడానికి ఆస్పత్రులు ఒప్పుకోలేదు' అని అన్నారు. దీనిపై ధర్మాసనం స్పందిస్తూ.. గాయపడిన బాధితురాలిని చేర్చుకునేందుకు నిరాకరించిన మూడు ఆస్పత్రుల విషయంపై కూడా దర్యాప్తునకు ఆదేశించింది. గాయపడ్డ లాయర్‌కు ఆర్థిక సాయం అందేలా చూడాలని అధికారులకు సూచించింది. తదుపరి విచారణ సమయంలో కేసు దర్యాప్తునకు సంబంధించిన వివరాలను వెల్లడించాలని తెలిపింది. కాగా, ఢిల్లీ కోర్టులో ప్రాక్టీస్ చేస్తున్న అడ్వకేట్ మధు రాజ్‌పుత్ ఆదివారం భర్త చేతిలో కత్తి దాడికి గురయ్యారు. ఈ విషయంపై నిన్ననే చీఫ్ జస్టిస్ సూర్య కాంత్‌కు ఓ లేఖ అందింది. ఆ లేఖ అందిన వెంటనే ఆయన సుమోటో కేసు రిజిస్ట్రర్ చేయాలని ఆదేశించారు.


# పాక్ తగిన మధ్యవర్తి కాదు

ఇరాన్ పార్లమెంట్ సభ్యుడి ఆరోపణ



**టెహ్రాన్, ఏప్రిల్ 27:** అమెరికా–ఇరాన్ మలివిడత చర్చలపై అనిశ్చితి కొనసాగుతోంది. ఈ నేపథ్యంలో మధ్యవర్తిగా పాకిస్థాన్ తటస్థ వైఖరితో సమర్థవంతంగా వ్యవహరించగలదా అని టెహ్రాన్ అధికారిక వర్గాల్లో ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ఇరాన్ పార్లమెంట్‌లో ఆ దేశ ఎంపీ, జాతీయ భద్రత విదేశాంగ విధాన కమిషన్ అధికార ప్రతినిధి అయిన ఇబ్రహీం రెజాయీ మాట్లాడుతూ.. పాక్ సరైన మధ్యవర్తి కాదనే అభిప్రాయాన్ని వ్యక్తంచేశారు. ఇస్లామాబాద్‌లో దౌత్యానికి అనుకూల పరిస్థితులు లేవని అన్నారు. పొరుగు దేశమైన పాకిస్థాన్ మనకు మంచి మిత్ర దేశం. కానీ అది చర్చలకు సరైన మధ్యవర్తి కాదు. మధ్యవర్తిత్వానికి అవసరమైన విశ్వసనీయత దానికి లేదు. పాక్ అమెరికా ప్రయోజనాలకు అనుగుణంగా ప్రవర్తిస్తుందే కానీ.. ఆ దేశ వైఖరిని సవాలు చేయడానికి సాహసించదు. లెబనాన్ విషయంలో అమెరికా అంగీకరించలేనివిధంగా డిమాండ్లు తెర పైకి తీసుకువచ్చినప్పుడు కూడా పాక్ నేతలు అడ్డు చెప్పలేదు. మధ్యవర్తులు నిష్పక్షపాతంగా ఉండాలి కానీ.. ఒక పక్షం వైపు మొగ్గు చూపకూడదు. ఇప్పటివరకు వారి విధానం చూస్తుంటే చర్చల విషయంలో వారు నిష్పక్షపాతంగా వ్యవహరించగలరా అనే దానిపై సందేహాలు తలెత్తుతున్నాయని ఇబ్రహీం రెజాయీ పార్లమెంట్‌లో పేర్కొన్నారు. అమెరికా–ఇరాన్ ల మధ్య తొలివిడత చర్చలు విఫలమైన తర్వాత మళ్లీ చర్చలు జరపాలని ఇరాన్ ప్రయత్నించినా అది సాధ్యం కాలేదు. శాంతిఒప్పందం కుదిరేవరకు ఇరాన్ ఓడరేవుల దిగ్బంధనాన్ని ఉపసంహరించుకోబోమని అమెరికా చెబుతుండగా.. దాన్ని తొలగించేవరకూ చర్చలు జరపబోమని ఇరాన్ స్పష్టం చేస్తోంది. కాగా తమ మధ్యవర్తిత్వంలో ఇరువర్గాల మధ్య పరోక్ష చర్చలు ఇప్పటికీ కొనసాగుతున్నాయని పాక్ అధికారులు పేర్కొన్నారు.

# ఫోటో జర్నలిస్ట్ రఘురాయ్ మృతికి మోడీ సంతాపం



**న్యూఢిల్లీ, ఏప్రిల్ 27:** ప్రముఖ భారతీయ ఫోటో జర్నలిస్ట్ రఘు రాయ్ మృతికి ప్రధాని మోడీ సంతాపం ప్రకటించారు. ఆదివారం ఆయన కన్నుమూసిన సంగతి తెలిసిందే. క్యాన్సర్ మహమ్మారితో పాటు వృద్ధాప్య సంబంధిత సమస్యల కారణంగా 83 ఏళ్ల వయసులో ఆయన ప్రాణాలు కోల్పోయారు. రఘు రాయ్ మరణంపై భారత ప్రధాని నరేంద్ర మోదీ స్పందించారు. సోమవారం ఎక్స్ వేదికగా ఆయనకు నివాళులర్పించారు. రఘు రాయ్ భారతదేశ జీవనశైలిని తన కెమెరా ద్వారా అద్భుతంగా బంధించిన క్రియేటివ్ దిగ్గజంగా గుర్తుండిపోతారని ప్రధాని పేర్కొన్నారు. మోదీ తన పోస్టులో.. పేర్కొన్నరు. రఘు రాయ్ ఫొటోగ్రఫీలో అసాధారణమైన సున్నితత్వం, వైవిధ్యం ఉండేవి. ఆయన ఫొటోగ్రఫీ భారతదేశంలోని వివిధ జీవన పార్శ్వాలను ప్రజలకు చేరువ చేసింది. రఘు రాయ్ మరణం ఫొటోగ్రఫీ, సాంస్కృతిక ప్రపంచానికి తీరని లోటు. ఈ విషాదకర సమయంలో నా ఆలోచనలు ఆయన కుటుంబసభ్యులు, అభిమానులు, ఫొటోగ్రఫీ రంగానికి చెందిన వారితో ఉన్నాయి. ఓం శాంతి' అని రాసుకొచ్చారు. రఘు రాయ్ 1942లో పంజాబ్‌లోని ఝంగ్‌లో జన్మించారు. సివిల్ ఇంజినీరింగ్ చేసిన ఆయన 23 ఏళ్ల వయసులోనే ఫొటోగ్రఫీ వైపు వచ్చారు. 'ద స్టేట్స్‌మన్' వార్తా పత్రికలో ఫొటోగ్రాఫర్‌గా చేరారు. దాదాపు 60 ఏళ్ల పాటు ఫొటోగ్రాఫర్‌గా కొనసాగారు. ఎన్నో అద్భుతమైన చిత్రాలను ఆయన తీశారు. దేశంలో చోటుచేసుకున్న ఎన్నో ముఖ్య ఘట్టాలను, విషాదాలను తన కెమెరాతో బంధించారు. దలైలామా, మదర్ థెరీసా, సత్యజిత్ రే, హరి ప్రసాద్ చౌరాసియా, బిస్మిల్లా ఖాన్ వంటి ప్రముఖుల జీవితాల్లోని అరుదైన కోణాలను కెమెరాతో స్పృశించారు.

# వంతెన లేక 'తొర్రే' గ్రామస్తుల వాన కష్టాలు!


## వానొస్తే దీవిలా మారుతున్న గ్రామం

### ప్రాణాలకు తెగించి వాగు దాటుతున్న జనం

### గర్భిణీలు.. విద్యార్థుల నరకయాతన

**మంచిర్యాల జిల్లా జన్నారం మండలంలోని తొర్రే గ్రామస్తులకు వాగు గండం వీడటం లేదు. పైన వాన పడి వాగులో కాస్త నీళ్లు రాగానే చాలు.. ఈ ఊరికి బాహ్య ప్రపంచంతో సంబంధాలు పూర్తిగా తెగిపోతున్నాయి. ఏళ్లుగా వంతెన కోసం మొరపెట్టుకుంటున్నా పాలకులకు కనీసం కనికరం కలగడం లేదని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఉధృతంగా ప్రవహించే నీటిలోనే ప్రాణాలకు తెగించి గర్భిణీలను.. పాఠశాల విద్యార్థులను దాటించాల్సి వస్తోందని.. ఏ చిన్న పొరపాటు జరిగినా పెద్ద ప్రమాదమే సంభవిస్తుందని గ్రామస్తులు భయాందోళన చెందుతున్నారు. అధికారుల నిర్లక్ష్యం తమ పాలిట శాపంగా మారిందని.. ఇప్పటికైనా స్పందించి వెంటనే వంతెన నిర్మించాలని వారు డిమాండ్ చేస్తున్నారు.**

**తుడుం జితేందర్ - జనం పవర్ ఉత్తర తెలంగాణ బ్యూరో**





జన్నారం మండలంలోని తొర్రే గ్రామం వర్షాకాలం వచ్చిందంటే చాలు బాహ్య ప్రపంచంతో సంబంధాలు తెగిపోతున్నాయి. ఏళ్లు గడుస్తున్నా.. ప్రభుత్వాలు మారుతున్నా ఆ ఊరి తలరాత మాత్రం మారడం లేదు. ఒక్క వాన పడితే చాలు వాగులు పొంగి ఆ గ్రామం ఒక దీవిలా మారిపోతోంది. వాగుపై కనీసం ఒక చిన్న వంతెన లేకపోవడంతో గ్రామస్తులు ప్రాణాలకు తెగించి ప్రవాహాన్ని దాటాల్సిన పరిస్థితి నెలకొంది. స్వల్ప వర్షానికే వాగు ఉధృతంగా ప్రవహిస్తుండటంతో జనం విలవిలలాడుతున్నారు.

#### నరకయాతన పడుతున్న జనం

ఈ పరిస్థితి వల్ల ముఖ్యంగా పాఠశాల విద్యార్థులు.. గర్భిణీలు.. వృద్ధులు నరకం చూస్తున్నారు. వాగు ఉధృతికి భయపడి పిల్లలు పాఠశాలలకు వెళ్లలేకపోవడంతో వారి విద్యా సంవత్సరం దెబ్బతింటోంది. అత్యవసర వైద్య సాయం కావాలంటే వాగు దాటడం ప్రాణసంకటంగా మారింది. గర్భిణీలను ఆసుపత్రికి తరలించాలంటే కిలోమీటర్ల మేర మోసుకెళ్లాల్సిన దుస్థితి నెలకొంది. రైతులు తాము పండించిన పంటను మార్కెట్‌కు తరలించలేక.. సకాలంలో ఎరువులు తెచ్చుకోలేక తీవ్రంగా నష్టపోతున్నారు.

#### పాలకుల నిర్లక్ష్యం

ఎన్నికల సమయంలో నాయకులు వచ్చి వంతెన కట్టిస్తామని హామీలు ఇస్తున్నా.. గెలిచాక ఆ ఊరి వైపు చూడటం లేదని గ్రామస్తులు మండిపడుతున్నారు. వృద్ధులు సైతం ఊతకర్రల సాయంతో నీటిలో ఇబ్బంది పడుతుంటే అధికారులు పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి వంతెన నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని.. తమ ఊరిని కష్టాల నుండి గట్టెక్కించాలని తొర్రే గ్రామ ప్రజలు వేడుకుంటున్నారు.

# సిద్దిపేటలో వాసవి అమ్మవారి రథోత్సవం!



- హరీష్ రావు చేతుల మీదుగా ప్రారంభం
- అంగరంగ వైభవంగా అమ్మవారి ఊరేగింపు

**జనం పవర్ - సిద్దిపేట ప్రతినిధి**

సిద్దిపేట పట్టణంలో శ్రీ వాసవి కన్యకాపరమేశ్వరి అమ్మవారి రథోత్సవం ఆదివారం రాత్రి అంగరంగ వైభవంగా జరిగింది. పట్టణ ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ వేడుకలో ఆర్యవైశ్యులంతా ఐకమత్యంతో పాల్గొన్నారు. అమ్మవారి రథాన్ని పట్టణ ప్రధాన వీధుల గుండా ఘనంగా ఊరేగించారు. రంగురంగుల పూలు.. విద్యుత్ దీపాలతో అలంకరించిన రథంపై అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు.

#### హరీష్ రావు పూజలు

ఈ రథోత్సవానికి ముఖ్య అతిథిగా సిద్దిపేట ఎమ్మెల్యే టీ. హరీష్ రావు హాజరయ్యారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి.. కొబ్బరికాయ కొట్టి రథోత్సవాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సిద్దిపేట ఆర్యవైశ్యులు భక్తిశ్రద్ధలతో.. ఐకమత్యంతో ఇలాంటి గొప్ప కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమని కొనియాడారు. అమ్మవారి ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలని ఆకాంక్షించారు.

#### మారుమోగిన సిద్దిపేట

పట్టణ ప్రధాన వీధుల గుండా సాగిన ఈ ఊరేగింపులో భక్తులు నీరాజనాలు పలికారు. ఆర్యవైశ్య సోదరీసోదరీమణులు.. యువకులు భక్తిపాటలకు అనుగుణంగా నృత్యాలు చేస్తూ "జై వాసవి.. జైజై వాసవి" నినాదాలతో సిద్దిపేట వీధులను మారుమోగించారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ఆర్యవైశ్య సంఘం నాయకులు విస్తృత ఏర్పాట్లు చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య భవనం కార్యవర్గం.. వార్డు సంఘ ప్రతినిధులు.. వాసవి.. వనిత.. యూత్ క్లబ్ సభ్యులు.. ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.




# ఘనంగా బీఆర్ఎస్ ఆవిర్భావ దినోత్సవం!

#### బిచ్కుందలో జెండా ఆవిష్కరణ



**బిచ్కుంద, ఏప్రిల్ 28 (జనం పవర్):** కామారెడ్డి జిల్లా బిచ్కుంద మండల కేంద్రంలో బీఆర్ఎస్ పార్టీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. పార్టీ కార్యాలయంలో మండల అధ్యక్షులు వెంకట్రావ్ దేశాయ్.. తెలంగాణ గద్దె వద్ద పట్టణ అధ్యక్షులు అవర్ శ్రీనివాస్ పార్టీ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర సాధన కోసం పార్టీ అధ్యక్షులు కేసీఆర్ చేసిన విశిష్ట కృషిని గుర్తు చేశారు. ఉద్యమానికి నాయకత్వం వహించి రాష్ట్ర సాధనలో కేసీఆర్ కీలక పాత్ర పోషించారని కొనియాడారు. మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ నాల్చర్ రాజు మాట్లాడుతూ కేసీఆర్ నాయకత్వంలో తెలంగాణ రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించిందని పేర్కొన్నారు. రైతు బంధు.. రైతు బీమా.. కల్యాణలక్ష్మి.. అమ్మ ఒడి.. కేసీఆర్ కిట్.. ఆసరా పింఛన్లు వంటి పథకాల ద్వారా ప్రజలకు విశేష సేవలు అందాయని తెలిపారు. ప్రజల ఆత్మగౌరవాన్ని నిలబెట్టిన నాయకుడిగా కేసీఆర్ చరిత్రలో నిలిచిపోతారని చెప్పారు. కార్యకర్తలు గ్రామ స్థాయిలో పార్టీని మరింత బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకులు.. కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# పాలమాకులలో వేడుకలు!

#### ఘనంగా బీఆర్ఎస్ జెండా ఆవిష్కరణ



**జనం పవర్ - సిద్దిపేట ప్రతినిధి**

పాలమాకుల గ్రామంలో భారత రాష్ట్ర సమితి (బీఆర్ఎస్) ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. పార్టీ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని గ్రామ బీఆర్ఎస్ అధ్యక్షులు వర్దోలు వెంకట్ యాదవ్ ఆధ్వర్యంలో పార్టీ జెండాను ఆవిష్కరించారు. తెలంగాణ ప్రజల ఆశయాలను నెరవేర్చడంలో బీఆర్ఎస్ కీలక పాత్ర పోషించిందని ఈ సందర్భంగా ఆయన పేర్కొన్నారు. సిద్దిపేట ఎమ్మెల్యే టీ. హరీష్ రావు ఆదేశాలు.. మండల అధ్యక్షుల సూచనల మేరకు ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు వెంకట్ యాదవ్ తెలిపారు. పార్టీ స్థాపన లక్ష్యాలను వివరిస్తూ కార్యకర్తలు పార్టీ బలోపేతానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ వేడుకల్లో గ్రామ నాయకులు.. కార్యకర్తలు ఉత్సాహంగా పాల్గొని పార్టీ నినాదాలతో హోరెత్తించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు వేణు యాదవ్.. రాగుల సారయ్య.. డి. శ్రీనివాస్ గౌడ్.. ఎల్లంకి రవీందర్ రెడ్డి పాల్గొన్నారు. సర్పంచ్ ఓజాల్.. ఉపసర్పంచ్ చంద్రం.. ఏటి బుచ్చయ్య.. సాంబయ్య.. అంజయ్య.. నూనె కుమార్.. ఏల్పుల ఐలయ్య.. చందు గౌడ్.. సాగర్.. సోహెల్.. కనకరాజు తదితర బీఆర్ఎస్ నాయకులు.. కార్యకర్తలు హాజరయ్యారు.

# ప్రత్యేక రాష్ట్రం తెచ్చిన పార్టీ బీఆర్ఎస్!

#### గ్రామ గ్రామాన ఎగిరిన గులాబీ జెండా

#### కేసీఆర్ నేతృత్వంలో మళ్లీ అధికారంలోకి: మండల అధ్యక్షులు పాకాల మైపాల్ రెడ్డి



**బెజ్జంకి, ఏప్రిల్ 28 (జనం పవర్):** ప్రత్యేక రాష్ట్రాన్ని సాధించి వెలుగులు పంచిన పార్టీ బీఆర్ఎస్ అని మండల అధ్యక్షులు పాకాల మైపాల్ రెడ్డి స్పష్టం చేశారు. పార్టీ 26వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా బెజ్జంకి మండల కేంద్రంతో పాటు అన్ని గ్రామాల్లో జెండా ఆవిష్కరణ కార్యక్రమాలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ ఆత్మగౌరవ ప్రతీకగా 2001లో జలదృశ్యంలో బీఆర్ఎస్ పార్టీ పురుడుపోసుకొని.. సుదీర్ఘ ప్రయాణంలో అనేక ఒడిదుడుకులను తట్టుకొని నిలబడిందని పేర్కొన్నారు. కేసీఆర్ నాయకత్వంలో 14 ఏళ్ల అలుపెరుగని పోరాటంతో 60 ఏళ్ల స్వరాష్ట్ర స్వప్నాన్ని సాకారం చేశామని మైపాల్ రెడ్డి గుర్తు చేశారు. పోరాడి తెచ్చుకున్న తెలంగాణను పదేళ్ల పాలనలో అన్ని రంగాల్లో దేశానికే ఆదర్శంగా నిలిపిన ఘనత తమ నాయకుడిదేనని కొనియాడారు. ప్రస్తుతం ప్రతిపక్షంగా ప్రజల పక్షాన పోరాడుతూ.. సర్కారు వైఫల్యాలను ఎండగడుతున్నామని చెప్పారు. కేసీఆర్, కేటీఆర్, హరీష్ రావు నేతృత్వంలో రాష్ట్రంలో మళ్లీ బీఆర్ఎస్ ప్రభుత్వం వస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



# కాంగ్రెస్‌లో కొత్త కమిటీల హడావుడి!

**గ్రామ స్థాయి నుండి రాష్ట్ర స్థాయి వరకు మార్పులు**

**కష్టపడే కార్యకర్తలకే పదవులు**

**సంగారెడ్డి డీసీసీ అధ్యక్షురాలు నిర్మలా జగ్గారెడ్డి**



**సంగారెడ్డి, ఏప్రిల్ 27 (జనం పవర్):** కాంగ్రెస్ పార్టీలో గ్రామ స్థాయి నుండి రాష్ట్ర స్థాయి వరకు కొత్త కార్యవర్గాలను ఏర్పాటు చేయాలని అధిష్టానం నిర్ణయించినట్లు సంగారెడ్డి డీసీసీ అధ్యక్షురాలు నిర్మలా జగ్గారెడ్డి తెలిపారు. సోమవారం గాంధీ భవన్‌లో ఏఐసీసీ ఇంచార్జ్ మీనాక్షి నటరాజన్, పీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ ఆధ్వర్యంలో జరిగిన ఉన్నత స్థాయి సమావేశంలో ఈ మేరకు నిర్ణయం తీసుకున్నారు. ఈ సమావేశంలో ఎంపీ సురేష్ షెట్కార్, ఇంచార్జిలు ప్రీతం, అజ్మతుల్లా పాల్గొన్నారు. బూత్ లెవల్ ఏజెంట్ నుండి బ్లాక్ స్థాయి వరకు మూడేళ్ళు పూర్తి చేసుకున్న అధ్యక్షులందరినీ మార్చాలని పార్టీ నిర్ణయించింది. ఆయా పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో సమావేశాలు నిర్వహించి.. నూతన కార్యవర్గాలను ఎన్నుకుని పీసీసీ కి జాబితా పంపాలని నిర్మలా జగ్గారెడ్డి సూచించారు. ఇప్పుడు ఎన్నుకోబోయే కమిటీలే రాబోయే అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల వరకు పనిచేస్తాయని స్పష్టం చేశారు. కమిటీల ఎంపికలో కష్టపడే కార్యకర్తలకు ప్రాధాన్యం కల్పించాలని.. అందరం కలిసికట్టుగా పనిచేసి మళ్లీ కాంగ్రెస్ ప్రభుత్వాన్ని అధికారంలోకి తీసుకురావాలని పిలుపునిచ్చారు.

# వెంకటాపూర్‌లో బీఆర్ఎస్ సంబరాలు!

**జూనేని నారాయణరావు ఆధ్వర్యంలో జెండా ఆవిష్కరణ**

**26వ ఆవిర్భావ వేడుకల్లో పాల్గొన్న కార్యకర్తలు**



**వేల్పుల నగేష్, జనం పవర్-ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా బ్యూరో**

మంచిర్యాల జిల్లా చెన్నూర్ నియోజకవర్గం మందమర్రి మండలం వెంకటాపూర్ గ్రామపంచాయతీలో బీఆర్ఎస్ పార్టీ 26వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా గ్రామంలోని బీఆర్ఎస్ సీనియర్ నాయకులు జూనేని నారాయణరావు పార్టీ జెండాను ఆవిష్కరించారు. తెలంగాణ ఆత్మగౌరవ ప్రతీకగా నిలిచిన పార్టీ బలోపేతానికి ప్రతి కార్యకర్త కృషి చేయాలని ఈ సందర్భంగా ఆయన పిలుపునిచ్చారు. గ్రామంలో గులాబీ జెండాలు రెపరెపలాడగా.. నాయకులు, కార్యకర్తలు జై తెలంగాణ, జై కేసీఆర్ నినాదాలతో హోరెత్తించారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ వేల్పుల రవి, వార్డు సభ్యులు వేల్పుల మహేశ్వరి, సాగర్, మాస్ సంతోష్, సిద్ధం వెంకటస్వామి, వేల్పుల చిరంజీవి పాల్గొన్నారు. వీరితో పాటు సుద్దుల సురేందర్, గోనే సుధాకర్ రావు, సుద్దుల నరేందర్, పెద్ది మల్లేష్, కాసిపేట శ్రీనివాసులు, నస్పూర్ రాజకుమార్, గట్టు శంకర్ గౌడ్, సుద్దుల రాజయ్య, సలేంద్ర పోచమల్లు, కురిమిళ్ళ సత్యనారాయణ, భారతపు శ్రీనివాస్, బక్కయ్య తదితరులు పాల్గొని వేడుకలను దిగ్విజయం చేశారు.

# నూతన కలెక్టర్‌కు పీఆర్‌టీయూటీఎస్ స్వాగతం!

**ప్రతీక్ జైన్‌కు మర్యాదపూర్వక భేటీ**



**సంగారెడ్డి, ఏప్రిల్ 27 (జనం పవర్):** సంగారెడ్డి జిల్లా నూతన కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన ప్రతీక్ జైన్‌ను పీఆర్‌టీయూటీఎస్ జిల్లా శాఖ ప్రతినిధులు సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. జిల్లా అధ్యక్షులు ఎ. మాణయ్య, ప్రధాన కార్యదర్శి ఎ. ప్రభు, గౌరవాధ్యక్షులు తులసీరాం రాథోడ్ ఆధ్వర్యంలో కలెక్టరేట్‌లో ఈ భేటీ జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్‌కు పూలమొక్క, నోటుపుస్తకాలు అందజేసి జిల్లాకు ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం సంఘం విశిష్టతను వివరించి బాధ్యులను పరిచయం చేశారు. కలెక్టర్ నాయకత్వంలో సంగారెడ్డి జిల్లా అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించాలని సంఘం నేతలు ఆకాంక్షించారు. ముఖ్యంగా విద్యారంగ పరిరక్షణకు ఉపాధ్యాయులుగా తమ వంతు పూర్తి సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు. సంఘ ప్రతినిధులను ఆత్మీయంగా ఆహ్వానించిన కలెక్టర్.. అందరితో కలిసి ఫోటో దిగడం పట్ల జిల్లా శాఖ హర్షం వ్యక్తం చేసింది. జిల్లా పరిపాలనలో తమవంతు భాగస్వామ్యం ఉంటుందని నేతలు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర, జిల్లా, మండల స్థాయి బాధ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. సంగారెడ్డి, కంది, కొండాపూర్, చౌటకూర్, అందోలు, న్యాల్కల్ తదితర మండలాల ప్రతినిధులు హాజరై కలెక్టర్‌కు శుభాకాంక్షలు తెలిపారు.



# కొనుగోలు కేంద్రాల కోసం రైతుల ధర్నా!

- ముత్యంపేట బ్రిడ్జి వద్ద బిజెపి నిరసన
- స్తంభించిన ట్రాఫిక్.. ఎస్సై హామీతో విరమణ
- రేపటి నుండి ధాన్యం కొనుగోళ్లు ప్రారంభం
- బిజెపి ప్రధాన కార్యదర్శి పత్తిపాక సంతోష్



**దండేపల్లి, ఏప్రిల్ 28 (జనం పవర్):** దండేపల్లి మండల ముత్యంపేట బ్రిడ్జి వద్ద వరి.. మొక్కజొన్న రైతులు బిజెపి ఆధ్వర్యంలో సోమవారం ధర్నా నిర్వహించారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలను వెంటనే ప్రారంభించాలని డిమాండ్ చేస్తూ రోడ్డుపై బైఠాయించారు. దీంతో వాహనాల రాకపోకలు నిలిచిపోయి భారీగా ట్రాఫిక్ జామ్ అయ్యింది. ఈ సందర్భంగా బిజెపి ప్రధాన కార్యదర్శి పత్తిపాక సంతోష్ మాట్లాడుతూ.. కొనుగోలు కేంద్రాలు తెరవకపోవడంతో రైతులు ధాన్యానికి కాపలా ఉంటూ ఎండలో తీవ్రంగా ఇబ్బంది పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి కొనుగోళ్లు మొదలుపెట్టాలని కోరారు. సమాచారం అందుకున్న దండేపల్లి ఎస్సై ఘటనా స్థలానికి చేరుకుని ఎమ్మార్వోతో ఫోన్లో మాట్లాడారు. మంగళవారం నుండి కొనుగోలు ప్రక్రియ ప్రారంభిస్తామని అధికారులు హామీ ఇవ్వడంతో రైతులు నిరసన విరమించారు. ఈ కార్యక్రమంలో ముత్తె అనిల్.. మాజీ మండల అధ్యక్షుడు బోడకుంటి వెంకటేష్.. మాజీ పీఏసీఎస్ చైర్మన్ బెడద సురేష్.. నాయకులు కర్ణాల కిషన్.. వల్లంబట్ల శ్రీనివాస్ పాల్గొన్నారు. వీరితో పాటు చుంచు గిరిధర్.. ముత్తె వెంకటేష్.. పత్తిపాక శ్రీనివాస్.. పెద్ద సంఖ్యలో రైతులు హాజరై నిరసన తెలియజేశారు.





# నిర్మాణ పనులు వేగవంతం చేయాలి

- అర్హులైన ప్రతి కుటుంబానికి ఇల్లు అందాలి
- ఎంపీ గడ్డం వంశీకృష్ణ, మంత్రి వివేక్ వెంకటస్వామి

**వేల్పుల నగేష్, జనం పవర్ ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా బ్యూరో**

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పురోగతిపై హిమాయత్ నగర్‌లోని హౌసింగ్ కార్పొరేషన్ కార్యాలయంలో కీలక సమీక్ష జరిగింది. రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అధ్యక్షతన నిర్వహించిన ఈ సమావేశంలో పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ, మంత్రి వివేక్ వెంకటస్వామి పాల్గొన్నారు. పనుల్లో జాప్యం లేకుండా అర్హులైన లబ్ధిదారులకు త్వరితగతిన ఇండ్లు మంజూరు చేయాలని.. భూమి సమస్యలు, ఇతర ఆటంకాలను వెంటనే తొలగించాలని అధికారులను ఆదేశించారు.

### ఫీల్డ్ స్థాయిలో పర్యవేక్షణ

అర్హులైన ప్రతి కుటుంబానికి ఇందిరమ్మ ఇల్లు అందేలా సమగ్ర కార్యాచరణ రూపొందించాలని ఎంపీ గడ్డం వంశీకృష్ణ సూచించారు. క్షేత్రస్థాయిలో పనుల పర్యవేక్షణను బలోపేతం చేయాలని మంత్రి వివేక్ వెంకటస్వామి అధికారులను కోరారు. అన్ని శాఖల అధికారులు సమన్వయంతో ముందుకు సాగితేనే లక్ష్యం నెరవేరుతుందని వారు స్పష్టం చేశారు. పనుల ఆలస్యంపై అసహనం వ్యక్తం చేస్తూ.. పారదర్శకంగా లబ్ధిదారుల ఎంపిక జరగాలని ఆదేశించారు. ఈ సమీక్షలో మంత్రి జూపల్లి కృష్ణారావు, ఎమ్మెల్సీలు దండే విఠల్, అంజిరెడ్డి, ఎమ్మెల్యేలు గడ్డం వినోద్, వెడ్మ బొజ్జు, పాయల శంకర్, రామారావు పటేల్, ప్రేమసాగర్ రావు, పాల్వాయి హరీశ్ బాబు పాల్గొన్నారు. అధికారుల్లో రెవెన్యూ శాఖ స్పెషల్ సెక్రటరీ లోకేష్ కుమార్, హౌసింగ్ కార్పొరేషన్ ఎమ్‌డీ వీపీ గౌతమ్, మంచిర్యాల కలెక్టర్ కుమార్ దీపక్, ఆదిలాబాద్ కలెక్టర్ రాజర్షి షా, ఆసిఫాబాద్ కలెక్టర్ హరిత, నిర్మల్ కలెక్టర్ భవేశ్ మిశ్రా హాజరయ్యారు.

# అమృత్ 2.0 పనులు నత్తనడకన!

- రూ. 17 కోట్లు వెచ్చించినా తప్పని తిప్పలు
- పిల్లర్ల స్థాయిలోనే నిలిచిన ట్యాంకుల నిర్మాణం
- నీటి కోసం పట్టణ ప్రజల ఆందోళన



**సంగారెడ్డి, ఏప్రిల్ 27 (జనం పవర్):** సంగారెడ్డి మున్సిపాలిటీలో తాగునీటి సమస్య తీర్చేందుకు చేపట్టిన అమృత్ 2.0 పనులు నత్తనడకన సాగుతున్నాయి. రూ. 17 కోట్ల భారీ వ్యయంతో ఆరు ఓవర్ హెడ్ ట్యాంకుల నిర్మాణానికి శ్రీకారం చుట్టినా.. పనుల పురోగతి ఆశించిన స్థాయిలో లేదు. ప్రధానంగా ప్రశాంత్ నగర్‌లో నిర్మిస్తున్న ట్యాంకు నెలల తరబడి పిల్లర్ల స్థాయిలోనే నిలిచిపోవడంతో స్థానికులు తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఆరు ట్యాంకులు పూర్తయితేనే పట్టణ ప్రజలకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని.. కానీ ప్రస్తుతం పనులు మధ్యలో నిలిచిపోవడంతో నీటి సరఫరాపై తీవ్ర ప్రభావం పడుతోంది.

### వేసవిలో నీటి కష్టాలు

ఎండలు మండుతున్న వేళ నీటి ఎద్దడి తీవ్రంగా ఉన్నా.. అధికారులు పనుల వేగవంతంపై దృష్టి పెట్టడం లేదని ప్రజలు మండిపడుతున్నారు. తాగునీటి కోసం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని.. పనులు ఆలస్యం కావడంతో తమ గోడు పట్టించుకునే వారే కరువయ్యారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి.. అమృత్ 2.0 పనులను యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. ప్రజలకు తాగునీటి కష్టాల నుండి విముక్తి కలిగించాలని కోరుతున్నారు.



# ఉన్నత శిఖరాలకు ఎదగాలి!

- ప్రభుత్వ అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలి
- మంచిర్యాల మేయర్ దర్శి మధుకర్
- బాలల రక్షణ వారోత్సవాలు ప్రారంభం
- ధ్రువపత్రాలు, బ్యాంక్ ఖాతాల పంపిణీ

వేల్పుల నగేష్, జనం పవర్ ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా బ్యూరో

ప్రభుత్వం కల్పిస్తున్న అవకాశాలను సద్వినియోగం చేసుకుని పిల్లలు ఉన్నత స్థాయికి ఎదగాలని మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ దర్శి మధుకర్ పిలుపునిచ్చారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా జిల్లా బాలల పరిరక్షణ విభాగం ఆధ్వర్యంలో నస్పూర్ సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో నిర్వహించిన 'ఆఫ్టర్ కేర్' కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఏప్రిల్ 27 నుండి మే 2వ తేదీ వరకు బాలల భద్రత, రక్షణ వారాన్ని నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు.

### ధ్రువపత్రాల పంపిణీ

వారోత్సవాల మొదటి రోజున చైల్డ్ కేర్ ఇనిస్టిట్యూట్‌లలో ఉన్న పిల్లలకు అవసరమైన ధ్రువపత్రాలను అందజేశారు. కుల ధ్రువీకరణ, జనన ధ్రువీకరణ పత్రాలతో పాటు ఆధార్ కార్డులు, బ్యాంక్ ఖాతాలను మేయర్ పంపిణీ చేశారు. ప్రభుత్వం అందిస్తున్న ఈ సదుపాయాలను వినియోగించుకొని భవిష్యత్తులో ఉన్నత శిఖరాలకు ఎదగాలని పిల్లలను ఆకాంక్షించారు. బాలల రక్షణ కోసం ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను ప్రతి ఒక్కరూ గుర్తించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారి రౌఫ్ ఖాన్, ఎస్సీ అభివృద్ధి శాఖ అధికారి చాతరాజుల దుర్గాప్రసాద్, మైనారిటీ సంక్షేమ అధికారి నీరటి రాజేశ్వరి పాల్గొన్నారు. వీరితో పాటు జిల్లా బాలల పరిరక్షణ విభాగం అధికారులు, సంబంధిత శాఖల సిబ్బంది హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# తాగునీటి పైప్‌లైన్లకు చెత్త గండం!



- పైప్‌లైన్ల చుట్టూ మురుగు నీరు, చెత్తాచెదారం
- కలుషిత నీరు సరఫరా అయ్యే ప్రమాదం
- పట్టించుకోని మున్సిపల్ అధికారులు

**సంగారెడ్డి పట్టణంలోని రాజంపేటలో తాగునీటి పైప్‌లైన్ల దుస్థితి ప్రజలను భయాందోళనకు గురిచేస్తోంది. పైప్‌లైన్ల చుట్టూ చెత్తాచెదారం, మురుగు నీరు నిలిచిపోవడంతో.. ఎక్కడ లీకేజీలు ఉన్నా కలుషిత నీరు సరఫరా అయ్యే ప్రమాదం పొంచి ఉంది. అధికారులకు ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా ఫలితం లేదని.. మురుగులోనే మంచినీటి పైపులు ఉండటం వల్ల రోగాల బారిన పడుతున్నామని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మున్సిపల్ అధికారులు తక్షణమే స్పందించి ఈ అపరిశుభ్రతను తొలగించాలని డిమాండ్ చేస్తున్నారు.**



**సంగారెడ్డి, ఏప్రిల్ 27 (జనం పవర్):** సంగారెడ్డి పట్టణంలోని రాజంపేట ప్రాంతంలో తాగునీటి పైప్‌లైన్ల చుట్టూ చెత్తాచెదారం, మురుగు నీరు పేరుకుపోవడంతో స్థానికులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పైప్‌లైన్ల సమీపంలో అపరిశుభ్ర వాతావరణం నెలకొనడంతో తాగునీటి నాణ్యతపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. పైప్‌లైన్లలో ఎక్కడైనా లీకేజీలు ఏర్పడితే మురుగు నీరు తాగునీటిలో కలిసే ప్రమాదం ఉందని.. దీనివల్ల ప్రజారోగ్యానికి ముప్పు వాటిల్లుతుందని స్థానికులు హెచ్చరిస్తున్నారు. ఈ సమస్యను పలుమార్లు మున్సిపల్ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఎలాంటి చర్యలు తీసుకోలేదని నివాసితులు ఆరోపిస్తున్నారు. అపరిశుభ్రత వల్ల రోగాల బారిన పడే అవకాశం ఉందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి పైప్‌లైన్ పరిసరాలను శుభ్రపరచాలని.. అవసరమైన మరమ్మతులు చేపట్టి స్వచ్ఛమైన తాగునీరు అందేలా చూడాలని డిమాండ్ చేస్తున్నారు. లేనిపక్షంలో ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

# దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలి!

- ప్రజల నమ్మకాన్ని వమ్ము చేయొద్దు.. మొత్తం 98 వినతుల స్వీకరణ
- జిల్లా కలెక్టర్ కె. హైమావతి

**సిద్దిపేట, ఏప్రిల్ 27 (జనం పవర్):** ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా వచ్చిన దరఖాస్తులను సత్వరంగా పరిష్కరించేందుకు అధికారులు తక్షణ చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ కె. హైమావతి సూచించారు. సోమవారం సమీకృత జిల్లా కార్యాలయ సముదాయంలోని సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణిలో జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ప్రజల వినతులను అదనపు కలెక్టర్ అబ్దుల్ హమీద్‌తో కలిసి కలెక్టర్ స్వీకరించారు. తమ సమస్యలు పరిష్కారం అవుతాయన్న నమ్మకంతో వచ్చే ప్రజల ఫిర్యాదులను క్షుణ్ణంగా పరిశీలించి.. అర్హత మేరకు వీలైనంత త్వరగా పరిష్కారం చూపాలని అధికారులను ఆదేశించారు. ఈ వారం ప్రజావాణిలో జిల్లావ్యాప్తంగా మొత్తం 98 దరఖాస్తులు వచ్చినట్లు కలెక్టర్ తెలిపారు. క్షేత్రస్థాయిలో సమస్యలను గుర్తించి బాధితులకు న్యాయం చేయాలని.. పనుల్లో జాప్యం జరిగితే సహించేది లేదని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో డీఆర్వో నాగ రాజమ్మ, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు. అర్జీదారులకు తీసుకున్న చర్యల గురించి ఎప్పటికప్పుడు సమాచారం అందించాలని కలెక్టర్ అధికారులకు దిశానిర్దేశం చేశారు.



# పేదల సొంతింటి కల సాకారం!

- అల్లీపూర్‌లో ఇందిరమ్మ ఇళ్ల గృహ ప్రవేశాలు
- పేదల జీవితాల్లో వెలుగులు నింపడమే లక్ష్యం
- నియోజకవర్గ ఇంచార్జ్ పూజల హరికృష్ణ



**జనం పవర్ - సిద్దిపేట ప్రతినిధి**

ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణంతో పేదల సొంతింటి కల సాకారం అవుతోందని కాంగ్రెస్ నియోజకవర్గ ఇంచార్జ్ పూజల హరికృష్ణ అన్నారు. మండల పరిధిలోని అల్లీపూర్ గ్రామంలో సోమవారం ఏఎంసీ చైర్మన్ మీసం మహేందర్‌తో కలిసి ఇందిరమ్మ ఇళ్లకు గృహ ప్రవేశ కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పేద ప్రజల గృహ స్వప్నాన్ని నెరవేర్చే లక్ష్యంతో ప్రభుత్వం ఈ ఇళ్ల నిర్మాణాన్ని చేపట్టిందన్నారు. పేదల జీవితాల్లో వెలుగులు నింపడమే కాంగ్రెస్ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. ఇందిరమ్మ రాజ్యంలోనే అన్ని వర్గాలకు మేలు జరుగుతుందని.. పార్టీ ఎల్లప్పుడూ అండగా నిలుస్తుందని తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కారం.. సంక్షేమ పథకాల అమలులో కాంగ్రెస్ ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోందని హరికృష్ణ అన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ వైస్ చైర్మన్ బుస్సా రాజశేఖర్, డైరెక్టర్లు వినోద్, రాజ వర్ధన్ రెడ్డి, మహేందర్ రెడ్డి, విజయ్ కుమార్, భూపతి రెడ్డి, దేవరాయల చంద్రశేఖర్, సోనీ, లక్ష్మి, రాజు, ఎండి సలీం, సర్పంచులు నవీన్, వార్డు సభ్యులు, ఇందిరమ్మ కమిటీ సభ్యులు పాల్గొన్నారు. అలాగే కాంగ్రెస్ మండల ఉపాధ్యక్షులు పరుశురాం, ఎస్సీ సెల్ జిల్లా కన్వీనర్ పొన్నాల రాజేష్, మహిళా విభాగం అధ్యక్షురాలు ముద్దం లక్ష్మి, నాయకులు బొమ్మల యాదగిరి, ఖలీముద్దీన్, లహరి, ప్రశాంత్, గొట్టిపర్తి చందు, జక్కుల నాగరాజు, కొరిమి రాజు, నక్కరాజు, కోడెల నాగరాజు, యాదగిరి, మల్లేశం, లచ్చయ్య, భూమయ్య, కొర్రి శంకర్, బర్ల స్వామి, పోశయ్య, మహేష్, హరిబాబు, రామకృష్ణ, అశోక్, జగన్ పాల్గొన్నారు.


# వీరశైవ సమాజం కోసం నరసింహులు కృషి!

### శుభకార్యాల్లో పాల్గొని జ్ఞాపికల అందజేత



**సంగారెడ్డి, ఏప్రిల్ 27 (జనం పవర్):** సంగారెడ్డి జిల్లా వీరశైవ సమాజం అధ్యక్షులు ఇప్పపల్లి నరసింహులు సమాజ సేవలో తన చురుకుదనాన్ని చాటుకుంటున్నారు. పలు శుభకార్యాలకు హాజరై.. సమాజం తరఫున జ్ఞాపికలను అందజేసి ఆత్మీయులను సత్కరించారు. అనంతరం సికింద్రాబాద్‌లో నిర్వహించిన ముఖ్య సమావేశంలో ఆయన పాల్గొన్నారు. వీరశైవ సమాజ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు, భవిష్యత్ కార్యాచరణపై పలువురు ప్రముఖులతో విస్తృతంగా చర్చించారు. సమాజ సేవలో ఎల్లప్పుడూ ముందుండే నరసింహులు.. వీరశైవ సమాజ అభ్యున్నతికి నిరంతరం కృషి చేస్తూ అందరికీ ఆదర్శంగా నిలుస్తున్నారని సభ్యులు కొనియాడారు. సమాజ బలోపేతం కోసం ఆయన చేస్తున్న కృషిని ప్రముఖులు అభినందించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీ బీబీ పాటిల్, మాజీ జనరల్ సెక్రటరీ జయప్రకాశ్, సమాజ సభ్యులు పాల్గొన్నారు.





జనం పవర్
JANAM POWER
మంగళవారం
28 ఏప్రిల్ 2026

# కోహెడలో బీఆర్ఎస్ ఆవిర్భావ వేడుకలు!

**తెలంగాణ రాష్ట్ర శిల్పి కేసీఆర్ సేవలు చిరస్మరణీయం**

**పల్లె పల్లెనా ఎగిరిన గులాబీ జెండా**

**సంబరాల్లో పాల్గొన్న పార్టీ శ్రేణులు**



**కోహెడ, ఏప్రిల్ 27 (జనం పవర్):** సిద్దిపేట జిల్లా కోహెడ మండలంలోని వివిధ గ్రామాల్లో బీఆర్ఎస్ పార్టీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. గ్రామ శాఖ అధ్యక్షులు, సర్పంచులు, పార్టీ ముఖ్య నాయకులు తెలంగాణ ఉద్యమ స్ఫూర్తిని స్మరించుకుంటూ ప్రతి గ్రామంలో పార్టీ జెండాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. ప్రత్యేక రాష్ట్ర సాధన కోసం కేసీఆర్ చేసిన త్యాగాలు, పోరాటం భారత రాజకీయ చరిత్రలో నిలిచిపోతాయని కొనియాడారు. తెలంగాణ ప్రజల ఆత్మగౌరవాన్ని ప్రపంచానికి చాటి చెప్పిన మహానేత కేసీఆర్ అని పేర్కొన్నారు. కేసీఆర్ నాయకత్వంలో తెలంగాణ రాష్ట్రం అభివృద్ధి, సంక్షేమం, సాగునీటి రంగాల్లో దేశానికే ఆదర్శంగా నిలిచిందని నాయకులు తెలిపారు. రైతు బంధు, రైతు బీమా, కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్, ఆసరా పింఛన్లు, మిషన్ భగీరథ వంటి పథకాల ద్వారా పేదలు, రైతులు, మహిళలకు విశేష ప్రయోజనం కలిగిందని వివరించారు. కేసీఆర్ ఆశయాలే మార్గదర్శకమని, గ్రామ స్థాయిలో పార్టీని మరింత బలోపేతం చేసి ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ వేడుకల్లో పార్టీ నాయకులు, మహిళా విభాగ సభ్యులు, యువజన నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. జెండా ఆవిష్కరణ అనంతరం మిఠాయిలు పంపిణీ చేసి ఉత్సాహంగా సంబరాలు నిర్వహించారు. తెలంగాణ రాష్ట్ర నిర్మాణంలో కేసీఆర్ చేసిన సేవలను ఈ సందర్భంగా ప్రజలకు మరోసారి గుర్తు చేశారు. మండల వ్యాప్తంగా జరిగిన ఈ కార్యక్రమాలు పార్టీ శ్రేణుల్లో కొత్త ఉత్తేజాన్ని నింపాయి.







# శనగ, జొన్న కేంద్రాలు ఏర్పాటు చేయాలి!

- మార్క్‌ఫెడ్ ఆధ్వర్యంలో కొనుగోళ్లు జరపాలి
- దళారుల వల్ల రైతన్నకు తీవ్ర నష్టం
- కలెక్టర్‌కు మంజీరా రైతు సంఘం వినతి

**సంగారెడ్డి, ఏప్రిల్ 27 (జనం పవర్):** జిల్లాలో మార్క్‌ఫెడ్ ఆధ్వర్యంలో శనగలు, జొన్నల కొనుగోలు కేంద్రాలను వెంటనే ఏర్పాటు చేయాలని తెలంగాణ మంజీరా రైతు సంఘం ప్రతినిధులు కోరారు. సోమవారం జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్‌ను మర్యాదపూర్వకంగా కలిసి ఈ మేరకు వినతిపత్రం సమర్పించారు. జిల్లాలో కొనుగోలు కేంద్రాలు లేకపోవడంతో రైతులు తమ పంటను అమ్ముకోవడానికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని.. గత్యంతరం లేక మధ్య దళారులను ఆశ్రయిస్తూ తీవ్రంగా నష్టపోతున్నారని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు.

## గిట్టుబాటు ధర కల్పించాలి

దళారుల ప్రమేయం వల్ల రైతులకు కనీస గిట్టుబాటు ధర లభించడం లేదని సంఘం రాష్ట్ర అధ్యక్షులు పృథ్వీరాజ్ ఆవేదన వ్యక్తం చేశారు. మార్క్‌ఫెడ్ ద్వారా ప్రభుత్వమే నేరుగా కొనుగోలు కేంద్రాలు ప్రారంభిస్తే.. రైతులు తమ ఉత్పత్తులను నేరుగా ప్రభుత్వానికి విక్రయించే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. జిల్లాలోని అవసరమైన ప్రాంతాలను గుర్తించి వెంటనే కొనుగోలు ప్రక్రియ మొదలుపెట్టాలని.. తద్వారా రైతులకు మద్దతుగా నిలవాలని కలెక్టర్‌ను కోరారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.



# వడ్డెరుల జీవనాధారంపై కబ్జా కోరలు!

- తాతల కాలం నాటి వృత్తిని దెబ్బతీస్తున్నారు
- కలెక్టర్‌కు వినతిపత్రం అందజేత
- అక్రమార్కులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్
- వడ్డెర సంఘం నాయకులు కనకయ్య

**జనం పవర్ - సిద్దిపేట ప్రతినిధి**

సిద్దిపేట జిల్లా వర్గల్ మండలం జబ్బాపూర్ గ్రామంలో వడ్డెర కులస్తుల జీవనాధారమైన బండరాయిపై ఆక్రమణ ప్రయత్నాలు జరుగుతున్నాయంటూ బాధితులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. తాతల కాలం నుండి రాయి కొట్టే వృత్తిని ఆధారంగా చేసుకుని బతుకుతున్న తమ పొట్ట కొట్టవద్దని ఆవేదన వ్యక్తం చేశారు. తమకు సొంత భూములు లేవని.. దశాబ్దాలుగా ఈ బండరాయి పనే తమకు ఆధారమని పేర్కొన్నారు. ఇటీవల కొందరు వ్యక్తులు అకస్మాత్తుగా వచ్చి బండపై మట్టి పోసి ఆక్రమించుకునే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. కబ్జాను అడ్డుకునేందుకు ప్రయత్నిస్తే తమపై బెదిరింపులకు దిగుతున్నారని.. గొడవలకు తెరలేపుతున్నారని బాధితులు తెలిపారు. తాము కొట్టిన రాళ్లతోనే జిల్లాలోని పలు ప్రభుత్వ భవనాలు నిర్మించబడ్డాయని గుర్తు చేశారు. అధికారులు వెంటనే స్పందించి భూమి సర్వే నిర్వహించి నిజానిజాలు వెలికి తీయాలని.. ఆక్రమణకు పాల్పడుతున్న వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. వడ్డెర కనకయ్య ఆధ్వర్యంలో గ్రామస్తులు జిల్లా కలెక్టర్‌ను కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో వడ్డెర రాజు, వడ్డెర బిక్షపతి, వడ్డెర యాదగిరి, వడ్డె లక్ష్మి, వడ్డె భారతి, వడ్డెర మంజుల, వడ్డెర రాములమ్మ పాల్గొన్నారు. తమకు న్యాయం జరిగే వరకు పోరాడతామని ఈ సందర్భంగా వారు స్పష్టం చేశారు.

# గోవధను పూర్తిగా నిషేధించాలి!

**గో సమ్మన్ ఆహ్వాన్ అభియాన్‌లో వినతిపత్రాల సమర్పణ**



**సంగారెడ్డి, ఏప్రిల్ 27 (జనం పవర్):** సంగారెడ్డి పట్టణంలో సోమవారం గో సమ్మన్ ఆహ్వాన్ అభియాన్ నిర్వహించారు. ఇందులో భాగంగా వివిధ హిందూ సంఘాల నాయకులు, కార్యకర్తలు కలిసి గోవధ నిషేధం, గోపోషణ, గోవుల సంపూర్ణ రక్షణ కోసం ఎమ్మార్వోకు వినతిపత్రం సమర్పించారు. దేశవ్యాప్తంగా ఏప్రిల్ 27న నిర్వహించిన ఈ కార్యక్రమంలో భాగంగా అన్ని ఎమ్మార్వో కార్యాలయాలలో వినతిపత్రాలు అందజేశారు.

## కఠిన చట్టాలు తేవాలి

గోవధను పూర్తిగా నిషేధించేలా రాష్ట్ర ప్రభుత్వం కఠిన చట్టాలను అమలు చేయాలని.. ప్రతి గోవుకు తగిన ఆహారం, సంరక్షణ కల్పించేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని నాయకులు కోరారు. తమ వినతిపత్రాన్ని రాష్ట్రపతి, ప్రధాన మంత్రి, గవర్నర్, ముఖ్యమంత్రికి చేరేలా చర్యలు తీసుకోవాలని ఎమ్మార్వోను అభ్యర్థించారు. దీనికి అధికారులు సానుకూలంగా స్పందించారు.

## గోరక్షణే ధర్మం

ఈ కార్యక్రమంలో శ్రీ వైకుంటపురం దేవస్థానం ప్రధాన అర్చకులు కందాడై వరదాచార్యులు పాల్గొని మాట్లాడారు. గోవు ఎక్కడ సంతోషంగా ఉంటుందో అక్కడ సుభిక్షం నెలకొంటుందని.. ప్రజలు ఆయురారోగ్యాలతో జీవిస్తారని పేర్కొన్నారు. గోవును రక్షించడం, పూజించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని చెప్పారు. గోవధ నిరోధానికి ప్రభుత్వం మరింత కఠినమైన నిర్ణయాలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో హిందూ సంఘాల నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



# రాజీవ్ పార్క్ పనులను వేగవంతం చేయండి!

**మే 10లోగా పార్క్ పనులు పూర్తి కావాలి.. రూ. 3 కోట్లతో అత్యాధునిక హంగులు**

**శంకుస్థాపనకు సిద్ధం చేయాలని అధికారులకు టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి ఆదేశం**

**సంగారెడ్డి, ఏప్రిల్ 27 (జనం పవర్):** రాజీవ్ పార్క్ పునరుద్ధరణ పనులను గడువులోగా పూర్తి చేసి.. శంకుస్థాపనకు సిద్ధం చేయాలని టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి అధికారులను ఆదేశించారు. సోమవారం ఆయన పార్కులో జరుగుతున్న పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించి మున్సిపల్ అధికారులకు దిశానిర్దేశం చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సంగారెడ్డికి రానున్న నేపథ్యంలో.. మే 10వ తేదీ నాటికి గ్రీనరీ, వాకింగ్ ట్రాక్, కాంపౌండ్ వాల్ పనులు పూర్తి చేయాలని స్పష్టం చేశారు.

## అత్యాధునిక హంగులతో పార్క్

పార్క్ ఎంట్రెన్స్ లోని రాజీవ్ గాంధీ విగ్రహం వద్ద ఆకర్షణీయమైన ల్యాండ్ స్కేప్ డిజైన్ ఏర్పాటు చేయాలని.. ప్రస్తుతం ఉన్న బ్లాక్ గ్రానైట్ స్థానంలో కొత్త టైల్స్ వేయాలని సూచించారు. పాడైపోయిన పాత మ్యూజిక్ ఫౌంటెన్ స్థానంలో అత్యాధునిక మ్యూజిక్ ఫౌంటెన్ తో పాటు 2డీ, 3డీ లేజర్ ఫౌంటెన్లను ఏర్పాటు చేయాలని అధికారులకు తెలిపారు. దీనికి సంబంధించిన పూర్తి ప్రతిపాదనలు బుధవారం లోగా సిద్ధం చేయాలని ఆదేశించారు. పార్కులో కృత్రిమ పాండ్, పెడల్ బోట్లు, సందర్శకుల కోసం బెంచీలు, ప్రత్యేకంగా స్కేటింగ్ గ్రౌండ్ ఏర్పాటు చేస్తున్నట్లు అధికారులు ఆయనకు వివరించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్ రెడ్డి, మున్సిపల్ డీఈ, నాయకులు తోపాజి అనంత్ కిషన్, కూన సంతోష్, కిరణ్ గౌడ్ పాల్గొన్నారు. పార్క్ ముందు భాగంలో పనులు పూర్తి చేసి.. ముఖ్యమంత్రి చేతుల మీదుగా ఫౌండేషన్ స్టోన్ వేయించేలా ఏర్పాట్లు చేయాలని జగ్గారెడ్డి అధికారులను కోరారు.



# నలుగురు కోఆప్షన్ సభ్యుల ఏకగ్రీవ ఎన్నిక!

- మౌలిక సదుపాయాల అభివృద్ధికి నిధుల ఆమోదం
- అల్పసంఖ్యాక వర్గాల ప్రతినిధులకు ప్రాధాన్యం
- చైర్పర్సన్ అధ్యక్షతన కౌన్సిల్ సమావేశం
- మున్సిపల్ చైర్పర్సన్ కూన వనిత సంతోష్

**సంగారెడ్డి, ఏప్రిల్ 27 (జనం పవర్):** సంగారెడ్డి పురపాలక సంఘం కార్యాలయంలో చైర్పర్సన్ కూన వనిత సంతోష్ అధ్యక్షతన సాధారణ సమావేశం జరిగింది. దీనితో పాటు కోఆప్షన్ సభ్యుల ఎన్నికకు సంబంధించి ప్రత్యేక సమావేశం కూడా నిర్వహించారు. పట్టణంలోని పలు వార్డుల్లో మౌలిక సదుపాయాల అభివృద్ధికి అవసరమైన నిధుల కేటాయింపులకు కౌన్సిల్ సభ్యులు ఆమోదం తెలిపారు. అనంతరం కోఆప్షన్ సభ్యుల ఎన్నిక ప్రక్రియను చేపట్టారు.

### అభ్యర్థుల ఎన్నిక

మున్సిపల్ పరిపాలనలో ప్రత్యేక పరిజ్ఞానం కలిగిన కేటగిరీలో శ్రీమతి యశోద, శ్రీ శివశంకరయ్య నామినేషన్లు దాఖలు చేశారు. అల్పసంఖ్యాక వర్గాల కేటగిరీలో శ్రీ సలావుద్దిన్, శ్రీమతి నఫిజ్ సుల్తానా నామినేషన్లు సమర్పించారు. మొత్తం నలుగురు అభ్యర్థులు ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు అధికారులు ప్రకటించారు. ఏకగ్రీవంగా ఎన్నికైన సభ్యులను చైర్పర్సన్, కౌన్సిల్ సభ్యులు అభినందించారు. పట్టణ అభివృద్ధిలో నూతన సభ్యులు క్రియాశీలకంగా వ్యవహరించాలని కోరారు. ఈ సమావేశంలో వైస్ చైర్మన్ షైక్ షఫీ, కమిషనర్ శ్రీనివాస్ రెడ్డి, కౌన్సిల్ సభ్యులు, మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు. వార్డుల్లో పెండింగ్‌లో ఉన్న పనులను త్వరితగతిన పూర్తి చేయాలని.. ప్రజలకు కనీస సౌకర్యాల కల్పనలో నిర్లక్ష్యం వహించవద్దని ఈ సందర్భంగా చర్చించారు.




# టీకా బాటలో మంచిర్యాల!

- ప్రతి బిడ్డకు రక్షణ కవచం అందాలి
- మారుమూల ప్రాంతాల్లో డీఎంహెచ్ఓ సుడిగాలి పర్యటన
- నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవు
- జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారిణి డాక్టర్ ఎస్. అనిత

**తుడుం జితేందర్-జనం పవర్-ఉత్తర తెలంగాణ బ్యూరో**

జిల్లాలో సంపూర్ణ ఆరోగ్య లక్ష్య సాధన కోసం జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారిణి (డీఎంహెచ్ఓ) డాక్టర్ ఎస్. అనిత క్షేత్రస్థాయిలో సుడిగాలి పర్యటన చేపట్టారు. ఏ ఒక్క బిడ్డ టీకాకు దూరం కాకూడదనే సంకల్పంతో సోమవారం కోటపల్లి నుండి చెన్నూర్ వరకు పలు ప్రాంతాల్లో ఆమె పర్యవేక్షించారు. కోటపల్లి పీహెచ్‌సీలో 'క్యాచ్‌అప్ వ్యాక్సినేషన్' ప్రచార రథాన్ని ప్రారంభించి స్వయంగా పిల్లలకు టీకాలు వేశారు. వలస కూలీల బిడ్డలు, ఇటుక బట్టీల వద్ద ఉండే నిరుపేదలు, మారుమూల గ్రామాల ప్రజలపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు.

### సిబ్బందికి హెచ్చరిక

మీజిల్స్, రూబెల్లాను తరిమికొట్టడమే లక్ష్యమని.. సిబ్బంది ఆసుపత్రులకే పరిమితం కాకుండా ఇంటింటికీ వెళ్లి సర్వే చేయాలని డాక్టర్ అనిత స్పష్టం చేశారు. పనితీరులో నిర్లక్ష్యాన్ని సహించేది లేదని హెచ్చరిస్తూ కుందారం, భీమారం పీహెచ్‌సీలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఎండలు మండుతున్న వేళ వడదెబ్బ మరణాలు సంభవించకుండా ప్రజలను చైతన్యపరచాలని.. ప్రతి కేంద్రంలో ఓఆర్ఎస్ మూలలను సిద్ధం చేయాలని సూచించారు. వైద్యులు, సిబ్బంది సమయపాలన పాటిస్తూ రోగులకు మెరుగైన సేవలు అందించాలని ఆదేశించారు.

### అవగాహనతోనే విజయం

చెన్నూరులో నూతనంగా నిర్మిస్తున్న అర్బన్ పీహెచ్‌సీ భవన పనులను పరిశీలించి త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. సీహెచ్‌సీ పరిధిలో వైద్య సేవలు మెరుగుపరచాలని దిశానిర్దేశం చేశారు. జిల్లా మాస్ మీడియా అధికారి బుక్క వెంకటేశ్వర్ ఆధ్వర్యంలో జరుగుతున్న ప్రచార పనులను అభినందించారు. మత పెద్దలు, స్థానిక నాయకుల సహకారంతో టీకాలపై అపోహలు తొలగించి వంద శాతం వ్యాక్సినేషన్ పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. ఈ పర్యటనలో డాక్టర్ రాజేష్, డాక్టర్ వంశీకృష్ణ, డీపీహెచ్ఎన్ పద్మ పాల్గొన్నారు.





# బస్వాపూర్‌లో బీఆర్ఎస్ వేడుకలు!

## ఘనంగా పార్టీ జెండా ఆవిష్కరణ

## కేసీఆర్ సేవలను గుర్తుచేసుకున్న శ్రేణులు



**కోహెడ, ఏప్రిల్ 27 (జనం పవర్):** సిద్దిపేట జిల్లా కోహెడ మండలం బస్వాపూర్ గ్రామంలో బీఆర్ఎస్ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. గ్రామ శాఖ అధ్యక్షులు తాటిపాలం శ్రీనివాస్ గౌడ్ ఆధ్వర్యంలో పార్టీ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం పార్టీ అధ్యక్షులు కేసీఆర్ చేసిన విశిష్ట కృషిని స్మరించుకున్నారు. ఉద్యమానికి నాయకత్వం వహించి రాష్ట్ర సాధనలో కేసీఆర్ కీలక పాత్ర పోషించారని కొనియాడారు. నాయకులు కొక్కుల సురేష్ మాట్లాడుతూ కేసీఆర్ నాయకత్వంలో తెలంగాణ రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించిందని పేర్కొన్నారు. రైతు బంధు, రైతు బీమా, కల్యాణలక్ష్మి, ఆసరా పింఛన్లు వంటి సంక్షేమ పథకాల ద్వారా ప్రజలకు విశేష సేవలు అందాయని తెలిపారు. తెలంగాణ ప్రజల ఆత్మగౌరవాన్ని నిలబెట్టిన నాయకుడిగా కేసీఆర్ చరిత్రలో నిలిచిపోతారని చెప్పారు. పార్టీ స్థాపన లక్ష్యాలను గుర్తుచేసుకుంటూ గ్రామ స్థాయిలో పార్టీ బలోపేతానికి కార్యకర్తలు కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు కొక్కుల రమేష్, చిన్న ఐలయ్య, బాలనర్స్, ప్రకాష్, ఇక్బాల్, షాబుద్దీన్, చిట్టి రాజిరెడ్డి, చంద్రయ్య పాల్గొన్నారు. వీరితో పాటు ఎండీ రఫిక్, లక్ష్మణ్, రాజిరెడ్డి, నందిని శ్రీనివాస్, తిరుపతి గౌడ్, గణేష్, ఆంజనేయులు, రమేష్, శ్రీనివాస్, ఎల్లయ్య, జనార్ధన్, అజయ్, నవీన్, బాబు, రాజయ్య, కే. నరసయ్య, జాంగిర్, శ్రీనివాస్, అమరేందర్, సత్తయ్య, శంకరయ్య, వెంకటయ్య, రాములు, లస్మయ, శ్రీశైలం, రాగోలు ఎల్లయ్య హాజరయ్యారు.

# రాంతీర్థ్‌లో అంబేద్కర్ విగ్రహావిష్కరణ!

## హాజరైన మంత్రి వివేక్ వెంకటస్వామి, ఎంపీ సురేష్ షెట్కార్



**సంగారెడ్డి, ఏప్రిల్ 27 (జనం పవర్):** సంగారెడ్డి జిల్లా న్యాల్కల్ మండలం రాంతీర్థ్ గ్రామంలో భారత రాజ్యాంగ నిర్మాత.. భారతరత్న డాక్టర్ బీ.ఆర్. అంబేద్కర్ విగ్రహావిష్కరణ మహోత్సవం ఆదివారం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి రాష్ట్ర మంత్రి వివేక్ వెంకటస్వామి, జహీరాబాద్ ఎంపీ సురేష్ శెట్కార్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ముందుగా అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి.. ప్రత్యేక పూజల అనంతరం విగ్రహాన్ని ఆవిష్కరించారు.

### ఆశయాలను కొనసాగించాలి

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రాజ్యాంగ నిర్మాతగా దేశానికి అంబేద్కర్ చేసిన సేవలు అమోఘమని కొనియాడారు. ఆయన సిద్ధాంతాలను యువత ఆదర్శంగా తీసుకుని ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. గ్రామంలో విగ్రహావిష్కరణ జరగడం తన అదృష్టమని సర్పంచ్ శ్రీనివాస్ రెడ్డి ఆనందం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా అంబేద్కర్ యువజన సంఘం సభ్యులు, కార్యకర్తలు, వివిధ గ్రామాల ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరై నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి చంద్రశేఖర్, గిరిధర్ రెడ్డి, తన్వీర్, చంద్రప్ప పటేల్, భాస్కర్ రెడ్డి పాల్గొన్నారు. వీరితో పాటు ఆల్ ఇండియా అంబేద్కర్ సంఘం జిల్లా అధ్యక్షులు దుర్గ ప్రసాద్, బీజీ సందీప్, బీఎస్పీ జిల్లా అధ్యక్షులు పీపడ్‌పల్లి మోహన్, నర్సింలు, మండల అధ్యక్షులు శ్రీనివాస్ రెడ్డి హాజరయ్యారు.




# 100 ఇస్తేనే సెల్ఫీ దిగుతా..

**చిన్నారులతో వైభవ్ సూర్యవంశీ సరదా ప్రాంక్**

వైభవ్ సూర్యవంశీ.. సంచలన ప్రదర్శనలు చేస్తూ ప్రపంచ దృష్టిని ఆకర్షిస్తున్నాడు. ఐపీఎల్ 2026లోనూ దూకుడుగా ఆడుతూ జట్టు విజయాల్లో కీలక పాత్ర పోషిస్తున్నాడు. 15 ఏళ్ల వైభవ్ కూడా గ్రౌండ్‌లో అల్లరి పనులు చేస్తూ సరదాగా ఉంటాడు. ఈ క్రమంలో వైభవ్ సూర్యవంశీకి సంబంధించిన ఓ వీడియో సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. తనతో సెల్ఫీ దిగడానికి వచ్చిన చిన్నారులను ఆటపట్టిస్తూ వైభవ్ ప్రాంక్ చేశాడు. ఈ వీడియోను రాజస్థాన్ రాయల్స్ ఫ్రాంచైజీ తన ఎక్స్ ఖాతాలో పోస్ట్ చేసింది. మంగళవారం పంజాబ్ కింగ్స్‌తో రాజస్థాన్ రాయల్స్ తలపడనుంది. అందుకోసం ఆర్ఆర్ టీమ్ ఇప్పటికే ఛత్తీస్‌గఢ్ చేరుకుంది. ఈ క్రమంలో ఎయిర్‌పోర్ట్‌లో వైభవ్ సూర్యవంశీని చూసేందుకు చిన్నారులు వచ్చారు. అతడితో సెల్ఫీ దిగడానికి ప్రయత్నించారు. ఇంతలో వైభవ్.. 'బ్రదర్.. నేను మీకు ఫొటో ఇవ్వాలంటే ఖర్చు అవుతుంది. నేను సీరియస్‌గానే చెబుతున్నా. డబ్బులు ఇస్తేనే ఫొటో దిగుతా' అని అన్నాడు. దీంతో ఆ చిన్నారులకు ఆశ్చర్యపోయి ఒకరి ముఖం మరొకరు చూసుకున్నారు. అక్కడి నుంచి వెళ్లిపోతుండగా.. వారిని ఆపిన వైభవ్ 'నేను ఒక్కోదానికి రూ.100 తీసుకుంటా. మీ దగ్గర ఎంత ఉందో చెప్పండి' అని అడిగాడు. అందులోని ఓ పిల్లాడు 'నా దగ్గర రూ.200 ఉంది' అని వైభవ్ సూర్యవంశీకి ఇవ్వబోయాడు. వెంటనే నవ్వేసిన వైభవ్.. ఇదంతా ప్రాంక్ అంటూ వారిని ఆటపట్టించాడు. ఆ తర్వాత ఆ పిల్లలతో ఫొటోలు దిగాడు. ఈ వీడియో ఇప్పుడు నెట్టింట తెగ వైరల్ అవుతోంది.




# ఉక్రెయిన్‌పై విజయం

**సజీవంగా క్వార్టర్స్ ఆశలు**

**హార్సెన్స్ (డెన్మార్క్):** ప్రతిష్టాత్మక ఉబర్ కప్‌లో భారత మహిళల బ్యాడ్మింటన్ జట్టు అదరగొట్టింది. తొలి మ్యాచ్‌లో ఆతిథ్య డెన్మార్క్‌తో ఓడినా తమ రెండో మ్యాచ్‌లో 4-1తో ఉక్రెయిన్‌పై ఏకపక్ష విజయం సాధించి క్వార్టర్స్ ఆశలు సజీవంగా నిలుపుకుంది. గ్రూప్-ఏ పోరులో భాగంగా మహిళల సింగిల్స్‌లో యువ సంచలనాలు ఉన్నతి హుడా, తన్వి శర్మ, దేవికా సిహాగ్ సత్తాచాటి భారత్‌కు విజయాన్ని అందించారు. మొదట ఉన్నతి.. 21-19, 22-20తో పోలిన బ్రహోవాను చిత్తుచేసి భారత్‌కు శుభారంభాన్ని అందించింది. అదే ఊపులో తన్వి.. 21-12, 17-21, 21-10తో యెవెనిలను ఓడించింది. మూడో సింగిల్స్‌లో దేవికా.. 23-21, 21-13తో మరియా స్టొలిరెంకొపై అలవోకగా నెగ్గి ఆధిక్యాన్ని 3-0కు తీసుకెళ్లింది. డబుల్స్‌లో కవిప్రియ-సిమ్రన్ ద్వయం 11-21, 17-21తో బ్రహోవా-యెవెనిల చేతిలో ఓడింది. కానీ రెండో డబుల్స్‌లో తనీషా.. సీనియర్ షట్లర్ పీవీ సింధుతో కలిసి 21-18, 21-15తో సోఫియా, స్టొలిరెంకొను మట్టికరిపించింది.




# 10 గంటల్లో 59 కిలోమీటర్లు ఈది

**కాచిగూడ:** బర్కత్‌పుర ప్రాం తానికి చెందిన అంతర్జాతీయ స్విమ్మర్ గంధం క్వీనీ విక్టోరియా మరో రికార్డును నెలకొల్పారు. శ్రీలంకలోని తలైమీనార్ నుంచి రామేశ్వరం ధనుష్కోడి (తమిళనాడు) వరకు ఐదుగురు మహిళలతో సముద్రాన్ని ఈది రికార్డు నమోదు చేసుకున్నారు.యూనిఫ్లై సంస్థ, స్విమ్‌లైఫ్ సహకారంతో ఓడబ్లూఎస్ఎఫ్ ఉపాధ్యక్షుడు సతీశ్‌కుమార్ పర్యవేక్షణలో ఈ ఐదుగురు.. రికార్డు సృష్టించారు. క్వీనీ విక్టోరియా సారథ్యంలో న్యూఢిల్లీకి చెందిన ఆర్సీ, మౌనిక (తెలంగాణ), స్మిత (మహారాష్ట్ర), ధాత్రిక మండవ (విజయవాడ) బృందం శ్రీలంకలోని తలైమీనార్‌లో ఆదివారం తెల్లవారుజామున రెండు గంటలకు స్విమ్మింగ్ ప్రారంభించి మధ్యాహ్నం 12.10 నిమిషాలకు తమ గమ్యాన్ని చేరుకున్నారు. 59 కిలోమీటర్ల దూరాన్ని 10 గంటల 10 నిమిషాల్లోనే పూర్తిచేసి రికార్డు సాధించారు.

# ఢిల్లీ డీలా
# బెంగళూరు బల్లే బల్లే!

**ఎనభై ఒక్క బంతులు మిగిలి ఉండగానే ఆర్సీబీ ఘన విజయం**





**పేకమేడలా కుప్పకూలిన ఢిల్లీ క్యాపిటల్స్ బ్యాటింగ్**
**నాలుగు వికెట్లతో చెలరేగిన ఆసీస్ పేసర్ జోష్ హేజిల్‌వుడ్**
**స్వల్ప లక్ష్యాన్ని ఉఫ్ మని ఊదేసిన బెంగళూరు బ్యాటర్లు**
**పడిక్కల్, కోహ్లీ మెరుపు ఇన్నింగ్స్.. సొంతగడ్డపై ఢిల్లీకి పరాభవం**

**ఢిల్లీ :** అరుణ్ జైట్లీ స్టేడియం వేదికగా సోమవారం జరిగిన ఐపీఎల్ మ్యాచ్‌లో ఢిల్లీ క్యాపిటల్స్ దారుణ పరాజయాన్ని మూటగట్టుకుంది. రాయల్ చాలెంజర్స్ బెంగళూరు బౌలర్ల ధాటికి ఢిల్లీ బ్యాటర్లు విలవిలలాడారు. ఫలితంగా బెంగళూరు జట్టు తొమ్మిది వికెట్ల తేడాతో ఏకపక్ష విజయాన్ని నమోదు చేసి పాయింట్ల పట్టికలో సత్తా చాటింది. బౌలింగ్‌లో హేజిల్‌వుడ్, భువనేశ్వర్ కుమార్ నిప్పులు చెరిగారు. బ్యాటింగ్‌లో పడిక్కల్, కోహ్లీ చెలరేగడంతో మ్యాచ్ వన్ సైడ్ గా మారిపోయింది.

### ఢిల్లీ ఇన్నింగ్స్.. పేకమేడలా..

సొంత మైదానంలో టాస్ ఓడిపోయి ముందుగా బ్యాటింగ్‌కు దిగిన ఢిల్లీ క్యాపిటల్స్‌కు బెంగళూరు బౌలర్లు చుక్కలు చూపించారు. పిచ్‌ను పూర్తిగా సద్వినియోగం చేసుకున్న ఆర్సీబీ బౌలింగ్ దళం.. ఢిల్లీ ఇన్నింగ్స్‌ను కకావికలం చేసింది. కేవలం 16.3 ఓవర్లలోనే 75 పరుగుల అత్యల్ప స్కోరుకు ఢిల్లీ జట్టును ఆలౌట్ చేశారు. ఢిల్లీ బ్యాటర్లలో అభిషేక్ పోరెల్ 33 బంతుల్లో 30 పరుగులు చేసి కాసేపు ఒంటరి పోరాటం చేశాడు. అతనికి తోడుగా డేవిడ్ మిల్లర్ 18 బంతుల్లో 19 పరుగులు, కైల్ జేమీసన్ 13 బంతుల్లో 12 పరుగులు చేశారు. మిగతా బ్యాటర్లంతా సింగిల్ డిజిట్ కే పరిమితమై పెవిలియన్ కు క్యూ కట్టారు. బెంగళూరు బౌలర్లలో జోష్ హేజిల్‌వుడ్ 3.3 ఓవర్లు బౌలింగ్ చేసి కేవలం 12 పరుగులు ఇచ్చి ఏకంగా నాలుగు వికెట్లు పడగొట్టాడు. ఇక భువనేశ్వర్ కుమార్ మూడు ఓవర్లలో ఐదు పరుగులే ఇచ్చి మూడు వికెట్లు తీసి ఢిల్లీ నడ్డి విరిచాడు. సుయాష్ శర్మ ఒక వికెట్ తీశాడు.

### చెలరేగిన పడిక్కల్, కోహ్లీ..

76 పరుగుల స్వల్ప లక్ష్యంతో బరిలోకి దిగిన బెంగళూరు బ్యాటర్లు ఎక్కడా తడబడలేదు. ఓపెనర్ జాకబ్ బెతెల్ 11 బంతుల్లో 20 పరుగులు చేసి ధాటిగా ఆడే ప్రయత్నంలో జేమీసన్ బౌలింగ్‌లో అవుటయ్యాడు. ఆ తర్వాత క్రీజులోకి వచ్చిన స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లీ, దేవ్ దత్ పడిక్కల్ వినాశకర బ్యాటింగ్‌తో చెలరేగారు. ఢిల్లీ బౌలర్లపై బౌండరీల వర్షం కురిపించారు. ముఖ్యంగా పడిక్కల్ ఆకాశమే హద్దుగా రెచ్చిపోయాడు. కేవలం 13 బంతుల్లోనే అజేయంగా 34 పరుగులు చేయగా.. కోహ్లీ 15 బంతుల్లో 23 పరుగులతో నాటౌట్‌గా నిలిచాడు. దీంతో కేవలం 6.3 ఓవర్లలోనే ఒక వికెట్ నష్టపోయి 77 పరుగులు చేసిన బెంగళూరు.. ఇంకా 81 బంతులు మిగిలి ఉండగానే అద్భుత విజయాన్ని సొంతం చేసుకుంది. ఢిల్లీ బౌలర్లలో కైల్ జేమీసన్ కు మాత్రమే ఒక వికెట్ దక్కింది.





# చిన్నస్వామి స్టేడియంలో భద్రతా కలకలం

- **240 సీసీటీవీ కెమెరాల ఫీడ్ కట్!**
- **జీతాల బకాయిల కోసం సిబ్బంది దుశ్చర్య**
- **అదుపులోకి తీసుకున్న పోలీసులు**
- **ఆర్సీబీ - గుజరాత్ మ్యాచ్ అనంతరం వెలుగులోకి.. స్టేడియంలో హైఅలర్ట్**



**బెంగళూరు:** ఐపీఎల్ 2026 సీజన్ ఉత్సాహంగా సాగుతున్న వేళ బెంగళూరులోని ప్రఖ్యాత చిన్నస్వామి స్టేడియంలో తీవ్ర భద్రతా ఉల్లంఘన చోటుచేసుకోవడం కలకలం రేపింది. 18 ఏళ్ల నిరీక్షణ తర్వాత గతేడాది ఆర్సీబీ టైటిల్ గెలిచిన వేళ జరిగిన విక్టరీ పరేడ్‌లో తొక్కిసలాట జరిగి 11 మంది మృతి చెందిన ఘటన మరువకముందే, తాజాగా స్టేడియంలోని నిఘా నేత్రాలను ఇద్దరు ఉద్యోగులు ధ్వంసం చేయడం గమనార్హం. స్టేడియం భద్రతను పర్యవేక్షించే సబ్ కాంట్రాక్ట్ కంపెనీకి చెందిన మంజునాథ్, అబ్దుల్ కలామ్ అనే ఇద్దరు వ్యక్తులు కంట్రోల్ రూమ్‌లోకి అక్రమంగా ప్రవేశించి సుమారు 240 సీసీటీవీ కెమెరాల ఫీడ్‌ను నిలిపివేసినట్లు పోలీసులు గుర్తించారు. ఏప్రిల్ 24న రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు మరియు గుజరాత్ టైటాన్స్ మధ్య జరిగిన ఉత్కంఠభరిత మ్యాచ్ ముగిసిన తర్వాత ఈ ఘటన చోటుచేసుకుంది. నిందితులు కాలం చెల్లిన (డీయాక్టివేట్ చేసిన) యాక్సిస్ కార్డును ఉపయోగించి కంట్రోల్ రూమ్‌లోకి ప్రవేశించారు. అక్కడ ఉన్న సీసీటీవీ ఫైబర్ కనెక్షన్లు మరియు వీడియో రికార్డర్లను (డీవీఆర్) ధ్వంసం చేసి నిఘా వ్యవస్థను స్తంభింపజేశారు. స్టేడియం ప్రవేశ ద్వారాలు, కార్పొరేట్ స్టాండ్లు మరియు ఇతర కీలక ప్రాంతాల్లోని దృశ్యాలు కనపడకుండా చేయడంతో అధికారులు ఒక్కసారిగా ఉలిక్కిపడ్డారు. దీనిపై కబ్బన్ పార్క్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టగా, తమకు రావాల్సిన రూ. 10 లక్షల బకాయిలను యాజమాన్యం చెల్లించకపోవడంతోనే ఈ దుశ్చర్యకు పాల్పడినట్లు నిందితులు విచారణలో ఒప్పుకున్నారు. ఘటనపై సమాచారం అందిన వెంటనే స్పందించిన స్టేడియం అధికారులు మరియు సాంకేతిక బృందం ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేశారు. బ్యాకప్ వ్యవస్థల సాయంతో ధ్వంసమైన కనెక్షన్లను సరిచేసి, రియల్ టైమ్ మానిటరింగ్‌ను తిరిగి సాధారణ స్థితికి తీసుకొచ్చారు. ప్రస్తుతం స్టేడియం అంతటా నిఘా నిరంతరాయంగా కొనసాగుతోందని భద్రతా విభాగం స్పష్టం చేసింది. అయితే చిన్నస్వామి స్టేడియంలో భద్రతా లోపాలు బయటపడటం ఇదే మొదటిసారి కాదు. ఐపీఎల్ ప్రారంభమైన కొద్ది రోజులకే ఇక్కడ బ్లాక్ టికెట్ల రాకెట్‌ను పోలీసులు ఛేదించగా, ఇప్పుడు ఏకంగా స్టేడియం లోపలే నిఘా వ్యవస్థపై దాడి జరగడం సర్వత్రా చర్చనీయాంశమైంది.

# శరవేగంగా కల్కి-2 షూటింగ్

## తమిళ నటుడు శింబు కూడా చేరినట్లు ప్రచారం

రెబల్ స్టార్ ప్రభాస్ హీరోగా, దర్శకుడు నాగ్ అశ్విన్ తెరకెక్కించిన 'కల్కి చిత్రం బాక్సాఫీస్ వద్ద సంచలన విజయాన్ని నమోదు చేసి వెయ్యి కోట్లకు పైగా వసూళ్లు సాధించింది. పురాణాల ఆధారంగా భవిష్యత్ నేపథ్యంలో సాగిన ఈ సినిమా ప్రేక్షకులను విపరీతంగా ఆకట్టుకుంది. ఇప్పుడు ఈ చిత్రానికి సీక్వెల్‌గా 'కల్కి 2'ను మరింత భారీ స్థాయిలో తీసుకురావడానికి మేకర్స్ సిద్ధమవుతున్నారు. ఇప్పటికే ప్రీ-ప్రొడక్షన్ పనులు వేగంగా సాగుతున్నాయి. కథను మరింత లోతుగా, భావోద్వేగపూర్వకంగా తీర్చిదిద్దేందుకు దర్శకుడు ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నట్లు సమాచారం. మొదటి భాగంలో చూపించిన ప్రపంచాన్ని విస్తరించి, కొత్త పాత్రలు, ఆసక్తికరమైన మలుపులతో సీక్వెల్‌ను రూపొందించాలని ప్లాన్ చేస్తున్నారు. తాజాగా వినిపిస్తున్న వార్తల ప్రకారం ఈ సీక్వెల్‌లో ఒక పవర్‌ఫుల్ స్పెషల్ పాత్ర ఉండబోతుందని, అది క్లైమాక్స్‌లో కీలకంగా మారుతుందని టాక్. ఆ పాత్ర కోసం తమిళ స్టార్ హీరో శింబును సంప్రదించినట్లు సినీ వర్గాల్లో చర్చ జరుగుతోంది. ఆయన ఈ సినిమాలో నటిస్తే తమిళ మార్కెట్‌లో సినిమాకు మరింత బలం చేకూరే అవకాశముందని అంటున్నారు. మొదటి భాగం చివర్లో ప్రభాస్ పాత్రను కర్ణుడిగా చూపిస్తూ మేకర్స్ ఇచ్చిన ట్విస్ట్ ప్రేక్షకులను ఆశ్చర్యపరిచింది. దీంతో సీక్వెల్‌పై ఆసక్తి మరింత పెరిగింది. ఈసారి కథ ప్రధానంగా కర్ణుడి గతం, అతని గాథ, తిరిగి రావడం వంటి అంశాలపై నడుస్తుందని సమాచారం. బాలీవుడ్ లెజెండ్ అమితాబ్ బచ్చన్ ఇప్పటికే షూటింగ్‌లో పాల్గొంటున్నారు. ఆయన మళ్లీ అశ్వత్థామ పాత్రలో కనిపించనున్నారు. ప్రస్తుతం హైదరాబాద్‌లో షూటింగ్ జరుగుతుండగా, బిజీ షెడ్యూల్ కారణంగా అభిమానులను కలవలేకపోయానని ఆయన తెలిపారు. ప్రభాస్ కూడా త్వరలో షూటింగ్‌లో చేరనున్నారని సమాచారం.ఇక మరో ముఖ్య ఆకర్షణగా కమల్ హాసన్ కూడా ఈ సీక్వెల్‌లో కనిపించనున్నారు. అమితాబ్ బచ్చన్, కమల్ హాసన్ చాలా ఏళ్ల తర్వాత మళ్లీ కలిసి నటిస్తుండడం విశేషం. ఇక ఈ సినిమాలో దుల్కర్ సల్మాన్, జేడీ చక్రవర్తి కూడా కీలక పాత్రల్లో కనిపించనున్నట్లు సమాచారం. దీంతో 'కల్కి 2'కు భారీ తారాగణం సిద్ధమవుతోంది.






# ఎంఎస్ సుబ్బలక్ష్మి బయోపిక్

## సాయిపల్లవి కాదు కాదు.. రుక్మిణీ వసంత్



జెర్సీ' ఫేమ్ గౌతమ్ తిన్ననూరి రూపొందించబోతున్న సంగీత సామ్రాజ్ఞి ఎమ్మెస్ సుబ్బులక్ష్మి బయోపిక్‌లో సాయిపల్లవి నటించబోతోందనే వార్త కొంతకాలంగా మీడియాలో చక్కర్లు కొడుతోంది. అలానే ఆమె పేరుతో పాటు నయనతార పేరు కూడా ఆ మధ్య వినిపించింది. అలా మరో ఇద్దరు ముగ్గురి పేర్లనూ ఎమ్మెస్ సుబ్బులక్ష్మి పాత్రతో ముడి పెట్టి కొందరు ప్రచారం చేశారు. అయితే ఫైనల్‌గా సాయిపల్లవి దగ్గరే అది ఆగింది. కానీ ఇప్పుడు ఆ పాత్ర సాయి పల్లవి చేజారి... రుక్మిణీ వసంత్ ను చేరిందని వార్తలు వస్తున్నాయి. సాయిపల్లవికి ఈ పాత్ర చేయాలనే కోరిక బలంగా ఉన్నా... ఇప్పటికే ఆమె కమిట్ అయిన సినిమాల కారణంగా డేట్స్ అడ్జస్ట్ చేయలేక ఈ పాత్రను వదిలేసుకుందని అంటున్నారు. ఇదిలా ఉంటే... పలు కన్నడ, తెలుగు సినిమాలతో ఇప్పటికే దక్షిణాది సినీ అభిమానుల గుండెల్లో చోటు దక్కించుకున్న రుక్మిణి వసంత్ ఎమ్మెస్ సుబ్బులక్ష్మి బయోపిక్‌లో నటిస్తున్నట్టు వార్తలు వస్తున్నాయి. 'కాంతార: చాప్టర్ 1'తో రుక్మిణీ వసంత్ సైతం జాతీయ స్థాయిలో మంచి గుర్తింపు తెచ్చుకుంది. ప్రస్తుతం ఆమె యశ్ మూవీ 'టాక్సిక్'లో నటిస్తోంది. అలానే ప్రభాస్ సరసన 'డ్రాగన్' చేస్తోంది. తమిళంలోనూ ధనుష్ మూవీలో రుక్మిణీ వసంత్ ఎంపికైందని వార్తలు వచ్చాయి. కెరీర్ మంచి ఊపు మీద ఉన్న ఈ సమయంలో ఆమె ఎమ్మెస్ సుబ్బులక్ష్మి పాత్రను చేస్తే ఖచ్చితంగా అది ప్రాజెక్ట్‌కు ఉపయోగపడే అంశమే! అయితే రుక్మిణీ వసంత్ ఎమ్మెస్ సుబ్బులక్ష్మిగా నటించబోతోందనే విషయాన్ని ఇంకా అధికారికంగా మేకర్స్ ప్రకటించలేదు.





# జూన్ 25న పెద్ది విడుదల ఖాయం

## దర్శకుడు సానా బుచ్చిబాబు వెల్లడి

రామ్‌చరణ్ హీరోగా నటిస్తున్న 'పెద్ది' చిత్రం విడుదలపై క్లారిటీ వచ్చింది. ఇప్పటికే రెండు సార్లు వాయిదా పడిన ఈ చిత్రం ఫైనల్‌గా జూన్ 25న విడుదల కానుందని రెండ్రోజులుగా వార్తలు హల్‌చల్ చేస్తున్న సంగతి తెలిసిందే! అయితే దీనిపై దర్శకుడు సాన బుచ్చిబాబు క్లారిటీ ఇచ్చారు. ధనుష్ హీరోగా నటించిన 'కర' చిత్రం ప్రీ రిలీజ్ ఈవెంట్‌కు ఆయన అతిథిగా హాజరయ్యారు. అక్కడ 'పెద్ది రిలీజ్ ఎప్పుడు అని అభిమానులు గోల చేయగా బుచ్చి విడుదల తేదిని ప్రకటించారు. ఎట్టి పరిస్థితుల్లో జూన్ 25 సినిమా ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుందని తెలిపారు. దీంతో అభిమానులు కాస్త ఊరట చెందారు. ఉత్తరాంధ్ర ప్రాంతంలో క్రీడా నేపథ్యంలో సాగే చిత్రమిది. ఇందులో చరణ్ సరసన జాన్వీకపూర్ నటిస్తున్నారు. ఏఆర్ రెహమాన్ సంగీతం అందిస్తున్నారు. ఇప్పటికే ఈ చిత్రం నుంచి విడుదలైన రెండు పాటలు దుమ్ము లేపేశాయి. త్వరలో ఓ డ్యూయెట్ రానుంది. ఆ తర్వాత శ్రుతీహాసన్, రామ్‌చరణ్‌పై చిత్రీకరిస్తున్న ప్రత్యేక గీతాన్ని విడుదల చేయడానికి ప్రయత్నం చేస్తున్నారు. షూటింగ్ ఆలస్య, పోస్ట్ ప్రొడక్షన్ పనులు సమయం సరిపోకపోవడం వల్ల విడుదల వాయిదా పడిన సంగతి తెలిసిందే.






# ధనుష్‌తో మరోమారు వెంకీ అట్లూరి జత

తమిళ నటుడు ధనుష్‌తో 'సార్' సినిమా తీసి విజయం అందుకున్నారు తెలుగు దర్శకుడు వెంకీ అట్లూరి. అప్పటి నుంచి వీరిద్దరి మధ్య బంధం బలపడింది. ధనుష్ నటించిన ఏ సినిమా తెలుగులో విడుదలైనా వెంకీ అట్లూరి ప్రమోషన్స్‌లో భాగమవుతున్నారు. 'సార్' కాంబినేషన్‌లో మరో సినిమా వస్తుందని చాలాకాలంగా టాక్ నడుస్తోంది. ఈ రూమర్స్ నిజమేనని స్పష్టమైంది. హైదరాబాద్‌లో జరిగిన 'కర' ప్రీరిలీజ్ ఈవెంట్‌కు వెంకీ అట్లూరి గెస్ట్‌గా హాజరయ్యారు. ఈ సందర్భంగా ధనుష్ వెంకీని ఉద్దేశించి మాట్లాడుతూ 'చివరి నిమిషంలో పిలిచినా వచ్చినందుకు థ్యాంక్స్. మీరు నాకు బ్రదర్‌లాంటివారు. 'సార్' లాంటి మంచి చిత్రాన్ని నాకు ఇచ్చారు. 'సార్' తర్వాత మీరో కథ నెరేట్ చేసి.. అదృశ్యమయ్యారు. ఆ కథను సంపూర్ణంగా తీసుకురండి. సినిమా చేయడానికి నేను రెడీగా ఉన్నా. మీ సక్సెస్‌కు చాలా ఆనందిస్తున్నా. మీ గత చిత్రం 'లక్కీ భాస్కర్' చాలా నచ్చింది. మీ రాబోయే సినిమా 'విశ్వనాథ్ అండ్ సన్స్' కు కూడా శుభాకాంక్షలు' అని అన్నారు. ధనుష్ నటించిన 'కర' సినిమా ఈ నెల 30న విడుదల కానుంది.

PRINTED, PUBLISHED and OWNED BY **G.THIRUPATHI,** PRINTED AT **SRK PRINTERS,** (V) KOKKERAKUNTA, RAMADUGU MANDAL, KARIMNAGAR DIST. 505001, TELANGANA,
PUBLISHED FROM H.NO.10-6-219, KISAN NAGAR, KARIMNAGAR 505001, TELANGANA, **RNI NO.TELTEL/2006/69862**, EDITOR: **BANDARI MARUTHI**